


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | ఆదివారం 08 ఆగస్టు 2021 | సంపుటి : 03 | సంచిక :06 | పేజీలు : 4 | వెల : రూ 3-00


# కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన

### పొందూరులో జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొన్న కేంద్రమంత్రి





శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా పొందూరులో జరిగే జాతీయ చేనేత దినోత్సవంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. స్పీకర్ తమ్మినేని సీతారామ్, డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గర రాజేంద్ర, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ జిల్లా అధికారులు స్వాగతం పలికారు. పొందూరు కేంద్రంగా పని చేస్తున్న ఆంధ్ర ఫైన్ ఖాదీ కార్మిక అభివృద్ధి సంఘం భవనాన్ని నిర్మలా సీతా రామన్ సందర్శించారు. ముందుగా చేనేత కార్యాలయం వద్ద నున్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన కేంద్ర మంత్రి సీతారామన్. అనంతరం చేనేత కార్మికులతో కలసి వారి స్థితిగతులను మంత్రి  నిర్మలా తెలుసుకున్నారు. 30 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టనున్న చేనేత కార్మికుల భవనానికి మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేశారు. అనంతరం మగ్గంపై నూలు వదులుతున్న నేత కార్మికుడిని స్వగృహానికి చేరుకుని కార్మికుడితో మాట్లాడారు. కేంద్ర మంత్రితో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, స్పీకర్ తమ్మినేని సీతారాం, శ్రీకాకుళం, విజయనగరం ఎంపీలు కే రామ్మోహన్ నాయుడు, బెందాలం చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర ప్రసాద్ , జిల్లా కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఖాదీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో జరిగే కార్యమంలో పాల్గొన్నారు. మార్కెట్ యార్డ్రాంగణంలో ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు ఏర్పాటుచేసిన ప్రదర్శనశాలలను నిర్మలా సీతారామన్ పరిశీలించారు.

పొందూరు ఖాదీకి ఖండాంతర ఖ్యాతి..

జిల్లాలో పొందూరులో తయారు చేసే ఖాదీ వస్త్రాల కు ఖండాంతర ఖ్యాతి ఉంది. ఇక్కడి నేత వస్త్రాలను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ఎంతో మక్కువ తో ధరించేవారు. ఆయన కట్టుతో పొందూరు వస్త్రానికి ఎంతో గొప్పతనం లభించింది. ప్రఖ్యాత న టుడు అక్కినేని నాగేశ్వరరావుతో పాటు పలువురు రాజకీయ నాయకులు, సినీ పరిశ్రమ నటులు ఈ పొందూరు ఖాదీకి అభిమానులు.చేప ముళ్లతో ఇక్కడ నూలు వడికి, 40, 60, 80, 100 కౌంటులతో కూడిన వస్త్రాలు నేస్తారు. కేవీఐసీ(ముంబై) ఆధ్వర్యంలో పొందూరు ఏఎఫ్‌కేకే సంఘం ఉన్నప్పటికీ సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవా ర్డును అందించింది. త్వరలో నగదును అందించనుంది. ఏఎఫ్‌కేకే సంఘం కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నప్పటికీ కళలు, కళారంగంలో ప్రోత్సాహానికి గాను ఇస్తు న్న పురస్కారాల్లో భాగంగా ఏఎఫ్‌కేకే సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం లైఫ్‌టైమ్ అవార్డు అందించింది.

# పథకం ఏదైనా పేదలకే ప్రాధాన్యం: ప్రధాని మోదీ




న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కరోనా సంక్షోభాన్ని ఎదుర్కునే వ్యూహంలో భాగంగా అన్ని పథకాల్లో పేదలకే ప్రాధాన్యం ఇస్తున్నదని ప్రధాని నరేంద్రమోదీ ( ఖఓ ఓనీటతి ) చెప్పారు. ఇవాళ మధ్యప్రదేశ్‌లో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన పథకం లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోదీ ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన పథకం అయినా, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ రోజ్‌గార్ యోజన పథకం అయినా మొదటి రోజు నుంచి తాము పేదల ఆహారం, ఉపాధి గురించే ఆలోచిస్తున్నామని చెప్పారు.దేశంలో 80 కోట్ల మందికిపైగా జనాభా ఉచితంగా రేషన్ పొందుతున్నారని ప్రధాని తెలిపారు. కేవలం బియ్యం, గోధుమలు, పప్పులు మాత్రమే కాదని.. దాదాపు 8 కోట్లకుపైగా మందికి లాక్‌డౌన్ సందర్భంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామని చెప్పారు. అదేవిధంగా 20 కోట్ల మందికిపైగా మహిళల జన్‌ధన్ ఖాతాల్లో 30,000 కోట్ల రూపాయలను జమచేశామన్నారు. అదేవిధంగా ఇటీవల మధ్యప్రదేశ్‌లో కురిసిన వర్షాలు, వరదలపై కూడా ప్రధాని మాట్లాడారు.రాష్ట్రంలో వరద పరిస్థితిని ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, అతని టీమ్ సమర్థంగా ఎదుర్కొన్నారని ప్రధాని కొనియాడారు. ఈ వరదల్లో కొందరు ప్రాణాలు కోల్పోవడం, పలువురు ఆవాసాలు కోల్పోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఒకప్పుడు మధ్యప్రదేశ్‌లో రోడ్లు అధ్వాన్నంగా ఉండేవని, రోడ్ల కోసం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేసేవాళ్లని ప్రధాని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రహదారుల రూపురేఖలు మారిపోయాయన్నారు.

## తిరుపతి రుయా ఘటనపై హైకోర్టులో ఏపీ ప్రభుత్వం కౌంటర్

అమరావతి: తిరుపతి రుయా ఘటనపై హైకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శనివారం కౌంటర్ దాఖలు చేసింది. ఆక్సిజన్ సరఫరాలో జాప్యం వల్లే ఘటన జరిగిందని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మృతులకు ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించామని, ఆక్సిజన్ సరఫరా చేసే కంపెనీపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. కాగా మే నెలలో తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో కరోనా రోగులు చికిత్స పొందుతున్న ఐసీయూలో ఆక్సిజన్ సరఫరాలో జాప్యంతో 11 మంది బాధితులు మృతి చెందిన సంగతి తెలిసిందే.



# హక్కులు-బాధ్యతల మధ్య సమన్వయం అవసరం: వెంకయ్య




న్యూఢిల్లీ : పౌర హక్కులు, సామాజిక బాధ్యతల మధ్య పరస్పర సమన్వయం ద్వారానే దేశాభివృద్ధి వేగవంతం అవుతుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. హక్కులకే ప్రాధాన్యతనిస్తూ బాధ్యతలను విస్మరించడం ద్వారా సమాజంలో సమన్వయం లోపిస్తుందని గుర్తుచేశారు. జాతీయవాది చమన్‌లాల్ జీ శతజయంతిని పురస్కరించుకుని పోస్టల్ శాఖ రూపొందించిన తపాలా బిళ్లను ఉపరాష్ట్రపతి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన చమన్‌లాల్ సేవలను కొనియాడారు.స్వార్థ ప్రయోజనాలను పక్కనపెట్టి జాతి ప్రయోజనాలే పరమావధిగా జీవించాలని ప్రతి నాగరికత, ప్రతి ధర్మం బోధిస్తున్నాయని వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, తదనంతర ప్రజాస్వామ్య పరిరక్షణలోనూ చమన్‌లాల్ జీ తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులను మాతృదేశంతో అనుసంధానమయ్యేలా, వారిలో జాతీయతాభావం పెంపొందేలా విశేష కృషిచేశారని కొనియాడారు. ఎమర్జెన్సీ సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వెనక్కు తగ్గకుండా జైలుపాలైన జాతీయవాదుల కుటుంబాలను నిరంతరం పరామర్శిస్తూ వారిలో ధైర్యాన్ని నింపారన్నారు. చమన్‌లాల్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న వెంకయ్యనాయుడు, పాతతరం అనుభవానికి కొత్తతరం ఆలోచనలు తోడైతేనే పురోగతి సాధ్యమని నమ్మేవారని చెప్పారు. విశ్వ అధ్యయన కేంద్రం ఏర్పాటులో చమన్‌లాల్ జీ కీలక పాత్ర పోషించారని, ప్రపంచవ్యాప్తంగా భారతీయతను ప్రతిబింబించే అంశంలో విశ్వ అధ్యయన కేంద్రం చేస్తున్న కృషిని ప్రశంసించారు.ఉపరాష్ట్రపతి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి దేవ్ సింగ్ చౌహాన్, కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, కేంద్ర మాజీ మంత్రి హర్షవర్ధన్, పలువురు పార్లమెంటు సభ్యులు, తపాలా శాఖ అధికారులు, విశ్వ అధ్యయన కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

# పాదయాత్రలో చేనేతల కష్టాలను కళ్లారా చూశా, వారి బాధలు విన్నా: సీఎం జగన్

అమరావతి: రాష్ట్రంలోని చేనేతల కష్టాలను పాదయాత్రలో కళ్లారా చూశానని, వారి బాధలు విన్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం జాతీయ చేనేత దినోత్సం సందర్భంగా సీఎం జగన్ నేతన్నలందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'చేనేతల కష్టాలను నా 3648 కిలో మీటర్ల సుధీర్ఘ పాదయాత్రలో కళ్లారా చూశా. వారి బాధలు విన్నా. మన ప్రభుత్వం రాగానే వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా అర్హులకు ఏటా రూ.24వేలు ఇస్తూ వారికి అండగా ఉంటున్నాం. నేతన్నలందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

# నేతన్నల నేటి దుస్థితిని తలచుకుంటే మనసు కలచివేస్తోంది : చంద్రబాబు

అమరావతి: పోగును వస్త్రంగా మలిచి.. మానవాళికి నాగరికతను నేర్పిన చేనేత సోదరులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు అని టీడీపీ చంద్రబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో గత తెలుగుదేశం పాలనలో నేతన్నలకిచ్చే త్రిఫ్టును 8 నుంచి 16శాతానికి పెంచామన్నారు. నూలుపై సబ్సిడీని 10 నుంచి 40శాతానికి పెంచామన్నారు. చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాల రాయితీని అమలు



చేశామని చంద్రబాబు వెల్లడించారు. పనులు లేని వర్షాకాలానికి భృతి అందించామన్నారు. 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చామని... ఆదరణతో పనిముట్లు అందజేసి అండగా నిలిచామన్నారు. తెలుగుదేశం హయాంలో నాటి పరిస్థితుల్ని, వైసీపీ ప్రభుత్వంలో నేతన్నల నేటి దుస్థితిని తలచుకుంటే మనసు కలచివేస్తోందన్నారు. ఏపీలో చేనేత కార్మికులకు ఏడాదికి రూ.50వేలకు పైగా వచ్చే రాయితీలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసి రూ.24 వేలతో సర్దుకోమంటూ తీరని ద్రోహం చేస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. నేతన్నల అభివృద్ధి, అభ్యున్నతిని ఈ ప్రభుత్వం ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. నాడు చేనేతలకు స్వర్ణయుగంగా ఉన్న పథకాలను రద్దు చేసి చీకట్లలోకి నెట్టేశారన్నారు. తెలుగుదేశం హయాంలో అందించిన ప్రోత్సాహకాలు, రాయితీలు నేతన్నలకు ఇవ్వాలన్నారు. అలాగే కరోనాతో నష్టపోయిన కార్మికులకు పరిహారం కూడా అందజేయాలని వైసీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు.

# 'నేతన్న నేస్తం'తో ఆగిన ఆత్మహత్యలు: సజ్జల

### చేనేత వస్త్రాలకు బ్రాండ్ క్రియేట్ చేస్తామని వెల్లడి

### విజయవాడలోని ఆప్కో భవన్‌లో జాతీయ చేనేత దినోత్సవం


విజయవాడ: 'నేతన్న నేస్తం' పథకంతో చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆగిపోయాయని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం విజయవాడలోని ఆప్కో భవన్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భారతీయతకు గుర్తింపు చేనేత అని తెలిపారు. ప్రభుత్వ సాయంతో చేనేతలు నిలబడే ప్రయత్నం చేయాలని సూచించారు. చేనేతరంగం మన ప్రస్థానం.. మరో ప్రస్థానంగా మార్చుతాయని పేర్కొన్నారు. మా బట్టలు మేమే తయారుచేసుకుంటాం.. మా సంప్రదాయ వస్త్రాలు మేం చేసుకుంటామని బ్రిటిష్ వారికి మహాత్మాగాంధీ ఎలుగెత్తి చాటారని గుర్తుచేశారు. చేనేత అనే పదం వింటే నాకు గుర్తొచ్చేది చట్రంతో వస్త్రం నేయటమేనని, నాకు మరచిపోలేని మంచి జ్ఞాపకమని సజ్జల తెలిపారు. గ్రామీణ స్థాయిలో అభివృద్ధిని చాటుతాం, గ్రామ స్వరాజ్యం దిశగా అడుగు వేస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే పెద్ద పెద్ద భవనాల నిర్మాణాలు కాదు, గ్రామీణ స్థాయిలోనూ సకల సౌకర్యాలు




కల్పించడమన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వచనమని వివరించారు. ఖాదీ, చేనేత, పొందూరు వస్త్ర పరిశ్రమల ద్వారా తయారైన వస్త్రాలను నవతరానికి చేరువ చేస్తామని వెల్లడించారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి వెబ్ పోర్టల్‌ల ద్వారా విక్రయాలు, మార్కెటింగ్ పెంచుతామని వివరించారు.నైపుణ్యం ఉన్న చేనేతల ద్వారా భావితరాలకు శిక్షణ ఇస్తామని మంత్రి గౌతమ్‌రెడ్డి చెప్పారు. గ్రామీణ స్థాయిలో సౌకర్యాలు కల్పించడమే అభివృద్ధి అని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలకు బ్రాండ్ క్రియేట్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ చల్లపల్లి మోహన్ రావు, చేనేత జౌళి శాఖ కార్యదర్శి శశిభూషణ్, చేనేత జౌళి డైరెక్టర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# రఘురామ కోర్టులో పిటిషన్.. విజయసాయిరెడ్డికి సీబీఐ కోర్టు నోటీసులు

హైదరాబాద్: ఎంపీ విజయసాయిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని ఎంపీ రఘురామకృష్ణరాజు హైదరాబాద్ నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణలో భాగంగా విజయసాయిరెడ్డికి సీబీఐ కోర్టు నోటీసులిచ్చింది. పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఆయనను కోర్టు ఆదేశించింది. ఈ నెల 10న విజయసాయి బెయిల్ రద్దు పిటిషన్‌పై సీబీఐ కోర్టు విచారణ జరుపుతుంది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో ఏ-2గా ఉ



న్న విజయసాయిరెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ రఘురామకృష్ణరాజు సీబీఐ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆయన తరపు న్యాయవాదులు వెంకటేశ్ సిద్దాని, పీఎస్ మూర్తి ఈ నెల 3వ తేదీన పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యసభ ఎంపీగా తనకు కేంద్ర మంత్రులతో సంబంధాలున్నాయంటూ సాక్షులను భయపెడుతున్నారని అందులో పేర్కొన్నారు. ఇప్పటికే ఆర్థిక నేరాలు, అక్రమాస్తుల కేసులో 11 చార్జిషీట్లలో ఏ1 ఉన్న జగన్ బెయిల్‌ను రద్దు చేయాలని కోర్టులో రఘురామ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన సీఎం పదవిని అడ్డుపెట్టుకుని కేసులను నీరుగారుస్తూ, సీబీఐ అధికారులు, సాక్ష్యాలను ప్రలోభాలకు గురిచేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అందువల్ల బెయిల్ రద్దు చేయాలని హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రఘురామ పిటిషన్‌పై కోర్టు విచారణ జరుగుతోంది.

# సంపాదకీయం

ఆదివారం 08 ఆగస్టు 2021

## కశ్మీర్ పై పాకిస్తాన్ కు చావని ఆశ

కాశ్మీర్‌కు ఇచ్చిన ప్రత్యేక హోదాను భారత ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ నిర్ణయం తీసుకునికి 2 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. అయితే, ఈ నిర్ణయం ప్రకటించినప్పుడు పాకిస్తాన్ తీవ్రంగా అభ్యంతరం చెప్పింది. కానీ, అంతర్జాతీయంగా దానికి తగిన మద్దతు లభించలేదు. దీనికి ప్రతిస్పందనగా, ఇప్పుడు పాకిస్తాన్ కూడా గిల్గిట్-బాల్టిస్తాన్‌ను ప్రత్యేక ప్రావిన్స్‌గా మార్చడానికి కసరత్తు ప్రారంభించింది. పాకిస్థాన్ మీడియా గిల్గిట్-బాల్టిస్తాన్‌ను ప్రావిన్స్‌గా మార్చడానికి పాకిస్తాన్ చట్టాన్ని ప్రారంభించిందని పేర్కొంటూ కథనాలు వెలువరుస్తున్నాయి.అయితే, గిల్గిత్-బాల్టిస్తాన్ సహా జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు భారతదేశంలో అంతర్భాగమని భారతదేశం స్పష్టం చేసింది. పాకిస్తాన్ తన ఆక్రమణను సమర్థించదు. చట్టవిరుద్ధమైన, బలవంతంగా ఆక్రమిత భూభాగాలు పాకిస్తాన్ లేదా దాని న్యాయవ్యవస్థ పరిధిలోకి రావు అని భారతదేశం పేర్కొంది. అసలు గిల్గిత్-బాల్టిస్తాన్ ఎక్కడుంది? దీని ప్రాధాన్యత ఏమిటి? దీనిపై వివాదం ఏమిటి? వంటి విషయాలు తెలుసుకుందాం.పాకిస్తాన్ చట్టం, న్యాయ మంత్రిత్వ శాఖ ఈ చట్టాన్ని రూపొందించింది, దీనిని 26 వ రాజ్యాంగ సవరణ బిల్లు అని పిలుస్తారు. పాకిస్తాన్ వార్తాపత్రిక డాన్ ప్రకారం, ప్రతిపాదిత చట్టం గిల్గిట్-బాల్టిస్తాన్ సుప్రీం అప్పీలేట్ కోర్టుని రద్దు చేసి, ఆ ప్రాంత ఎన్నికల కమిషన్‌ను పాకిస్థాన్ ఎన్నికల కమిషన్ లో విలీనం చేయడానికి ఒక నిబంధనను కలిగి ఉంది. అదే నివేదిక ప్రకారం, ఈ ముసాయిదా బిల్లు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ వద్ద ఉంది. ఈ ముసాయిదా బిల్లు పాకిస్తాన్ రాజ్యాంగం, అంతర్జాతీయ చట్టం, కాశ్మీర్, రాజ్యాంగ చట్టాలు, స్థానిక చట్టంపై ఐక్యరాజ్యసమితి తీర్మానాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించారని చెబుతున్నారు. ప్రతిపాదిత రాజ్యాంగ సవరణ బిల్లును రూపొందించడానికి ముందు గిల్గిత్-బాల్టిస్తాన్, పిఓకె ప్రభుత్వాలను కూడా సంప్రదించారు. గిల్గిత్-బాల్టిస్తాన్ ట్రాన్స్-హిమాలయన్ ప్రాంతంలో కశ్మీర్ లోయకు వాయువ్యంగా ఉంది. ఇది జమ్మూ కాశ్మీర్ సంస్థానంలో భాగం. అప్పుడు ఈ రాచరిక రాష్ట్రం ఐదు ప్రాంతాలుగా విభజనకు గురైంది. జమ్మూ, కాశ్మీర్, లడఖ్, గిల్గిట్ వజహత్ అలాగే, గిల్గిట్ ఏజెన్సీ.1947 నుండి పాకిస్తాన్ ఆక్రమించిన భారతదేశంలో, కేవలం 15% ప్రాంతం మాత్రమే పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో ఉంది. 85% గిల్గిత్-బాల్టిస్తాన్ లేదా ఉత్తర ప్రాంతాలలో ఉంది. ఇది చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ ప్రధాన ప్రాంతం. సింధు నది గిల్గిత్-బాల్టిస్తాన్ మీదుగా పాకిస్థాన్‌లోకి ప్రవేశించింది.వాస్తవానికి, 1917 లో యుఎస్ఎస్ఆర్ ఏర్పడిన తర్వాత, బ్రిటిష్ ఇండియా 1935 లో జమ్మూ కాశ్మీర్ మహారాజా నుండి గిల్గిట్ ఏజెన్సీని 60 సంవత్సరాల లీజుకు తీసుకుంది. కానీ భారతదేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు, 15 రోజుల తర్వాత 26 అక్టోబర్ 1947 న, హరి సింగ్ తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయాలని నిర్ణయించుకున్నప్పుడు, బ్రిటిష్ కమాండర్ విలియం అలెగ్జాండర్ బ్రౌన్ నేతృత్వంలోని గిల్గిట్ స్కౌట్స్ తిరుగుబాటు చేశారు. అతను లడఖ్‌లో భాగంగా ఉన్న బాల్టిస్థాన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నాడు. స్కార్డు, కార్గిల్, ద్రాసులను కూడా గిల్గిట్ స్కౌట్స్ ఆక్రమించాయి. యుద్ధంలో, భారత దళాలు ఆగస్టు 1948 లో కార్గిల్, ద్రాసులను తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. కానీ గిల్గిత్‌పై పాకిస్తాన్ అక్రమ ఆక్రమణ కొనసాగింది.రాజకీయ పార్టీ రివల్యూషనరీ కౌన్సిల్ ఆఫ్ గిల్గిట్-బాల్టిస్తాన్ 1 నవంబర్ 1947 న, గిల్గిత్-బాల్టిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించింది. నవంబర్ 15 న దీనిని పాకిస్తాన్‌లో విలీనం చేస్తున్నట్టు ప్రకటించారు. కానీ ఈ విలీనం షరతు ఏమిటంటే, ఇది పూర్తిగా పరిపాలనాపరమైన నియంత్రణ కోసమే ఉంటుంది. గత సంవత్సరం, పాకిస్తాన్ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ గిల్గిత్-బాల్టిస్తాన్ స్వాతంత్ర్యదినోత్సవాన్ని నవంబర్ 1 గా జరుపుకున్నారు.పాకిస్తాన్‌లో పౌర రాజ్యాంగం 1974లో అమలు చేశారు. దీనికి నాలుగు ప్రావిన్సులు ఉన్నాయి. పంజాబ్, సింధ్, బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా. పిఒకె, గిల్గిట్-బాల్టిస్తాన్‌లు ప్రావిన్సులు చేయడం జరగలేదు. కాశ్మీర్‌పై దావాకు సంబంధించిన అంతర్జాతీయ కేసును పాకిస్తాన్ విడదీయడానికి ఇష్టపడలేదు. దాని కారణంగా అది వేరుగా ఉంది.1975 లో పీవోకేకి దాని స్వంత రాజ్యాంగం కూడా వచ్చింది. ఇది స్వయం పరిపాలన స్వయంప్రతిపత్త భూభాగంగా చేయబడింది. కానీ గిల్గిత్-బాల్టిస్థాన్‌తో కూడిన ఉత్తర ప్రాంతం రాజ్యాంగంలో చోటు పొందలేదు. అయితే, ఇస్లామాబాద్ దానిని పాలించలేదని దీని అర్థం కాదు. ఈ ప్రావిన్సులకు స్వయంప్రతిపత్తి ఇచ్చినప్పటికీ, వాస్తవం ఏమిటంటే పీవోకే, గిల్గిత్-బాల్టిస్తాన్‌లో, ఇస్లామాబాద్ కోరుకున్నది జరిగింది.పీవోకే ప్రజలు రాజ్యాంగం ప్రకారం వారి హక్కులు, స్వేచ్ఛను పొందారు. షియా మెజారిటీ ఉన్న ఉత్తర ప్రాంతాలకు రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదు. వారిని పాకిస్థానీలుగా పరిగణిస్తారు, కానీ అది వారి పౌరసత్వం, పాస్‌పోర్ట్‌కు మాత్రమే పరిమితం. రాజ్యాంగ హక్కులు నాలుగు ప్రావిన్సులు, పిఒకె ప్రజలకు చెందినవి కావు.అమెరికాలో ఉగ్రవాద దాడి తర్వాత మారిన పరిస్థితి అదేవిధంగా, చైనా యొక్క వన్ రోడ్ వన్ బెల్ట్ ప్రాజెక్ట్‌లో ఈ ప్రాంతం ప్రాముఖ్యత కారణంగా, 2000 సంవత్సరం తరువాత పాకిస్తాన్‌కు రాజ్యాంగపరమైన జోక్యం అవసరం అయింది. . పాకిస్తాన్ ఉత్తర ప్రాంతాల శాసన మండలి ని 2009 లో గిల్గిట్-బాల్టిస్తాన్ ఆర్డర్ 2009 ద్వారా శాసనసభతో భర్తీ చేసింది. ఉత్తర ప్రాంతాలకు గిల్గిట్-బాల్టిస్తాన్ అని పేరు పెట్టారు ఒక ఎన్నికైన సంస్థ, కానీ దాని పాత్ర కశ్మీర్, ఉత్తర ప్రాంతాల వ్యవహారాల మంత్రికి సలహా ఇచ్చేది. అంటే, అది ఇస్లామాబాద్ నుండే.అసెంబ్లీలో ఖచ్చితంగా కొంత మెరుగుదల ఉంది. 24 మంది ప్రత్యక్షంగా ఎన్నికైన సభ్యులు అలాగే 9 మంది నామినేట్ చేయబడ్డారు. 2010 నుండి, ఇస్లామాబాద్‌లో అధికార పార్టీ ఈ స్థానాలను గెలుచుకుంటోంది. నవంబర్ 2020 లో, ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ పాకిస్తాన్-తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ 33 లో 24 సీట్లను గెలుచుకుంది. గిల్గిత్-బాల్టిస్తాన్ నాయకులు పాకిస్తాన్ 5 వ ప్రావిన్స్‌గా నిర్ణయించడం పట్ల సంతోషంగా ఉన్నారు. భారతదేశంలోని జమ్మూ కాశ్మీర్ నుండి ప్రత్యేక హోదా ఉపసంహరణకు ప్రతీకారంగా వారు దీనిని పరిగణిస్తున్నారు.జుల్ఫికర్ అలీ భుట్టో 1974 లో ఉత్తర ప్రాంతాలలో ,మహారాజు కాల నియమాలను మార్చారు. ఇప్పుడు బయటి వ్యక్తులు అక్కడ భూమిని కొనుగోలు చేయవచ్చు. ఫలితంగా, షియా జనాభా శాతం అక్కడ క్రమంగా తగ్గింది.

# అధికారుల తక్కువ..కల్తీలు ఎక్కువ

గుంటూరు, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)కల్తీలకు కాదేదీ అనర్హం అన్నచందంగా జిల్లాలో కొందరు వ్యాపారులు చెలరేగుతున్నారు. ప్రతి వస్తువునూ కల్తీచేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీ వస్తువులను నియంత్రించాల్సిన ఫుడ్ కంట్రోల్ శాఖ అధికారులు సిబ్బంది కొరతతో సతమతమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఫుడ్ కంట్రోలర్‌తో పాటు మరో ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉండటంతో వారు కల్తీలను నియంత్రించలేకపోతున్నారు. రెండేళ్ల క్రితం గుంటూరులో కల్తీ కారం జిల్లాలో సంచలనం రేకెత్తించింది. పలు మిల్లులు, గోదాముల్లో భారీ స్థాయిలో కల్తీకారం, మిరపకాయల తొడేలతో చేసిన కారం పట్టుబడింది. అప్పట్లో విజిలెన్స్, జిల్లాస్థాయి అధికారులు హడావుడి చేశారు. ప్రత్యేక బృందాలతో తనిఖీ చేసి శాంపిల్స్‌ను తీశారు. 97 శాంపిల్స్ తీయగా వాటికి సంబంధించి 16 కేసులు కోర్టులో నడుస్తున్నాయి. మరో 45 కేసులు జేసీ కోర్టులో ఉన్నాయి. 12 కేసులకు సంబంధించి అధికారులు జరిమానాలతో సరిపెట్టారు.కూరలో వేసే కారం నుంచి నూనె వరకు, నెయ్యి నుంచి టీపొడి వరకు, ఆఖరికి పాలు, పెరుగు, మిఠాయిలు, పండ్ల వరకు ప్రతి ఒక్కదానినీ కల్తీమయం చేస్తున్నారు. జిల్లాలో విజిలెన్స్ దాడుల్లో కల్తీ నెయ్యి, నూనెలు పలుమార్లు పట్టుబడ్డాయి. దీంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. తాము వాడుతున్న నూనెలు మంచివేనా అన్న అనుమానం వారిని పీడిస్తోంది. పండ్లు,టీపొడి, ఊరగాయలు, చికెన్, మటన్, ఇలా ప్రతి వస్తువులో కల్తీ జరుగుతోందని అధికారులు గుర్తిస్తున్నారు. దీంతో ప్రజలు ఏ వస్తువును కొనా లన్నా ఆందోళన చెందుతున్నారు. చివరకు హోటళ్లు, దాబాల్లో సైతం కల్తీ వస్తువులతో ఆహార పదార్థాలు తయారు చేస్తుండటంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రధానంగా హోటళ్లు, ప్రైవేటు హాస్టళ్లు, ప్రభుత్వ హాస్టళ్లకు కల్తీవస్తువులు సరఫరా చేస్తుండటంతో విద్యార్థులు, హోటళ్లలో భోజనం చేసేవారు అనారోగ్యం పాలవుతున్నారు.. ఈ కల్తీ వ్యవహారంలో ఓ అధికారి పార్టీ నేత పంచాయితీలు జరిపి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకొని కేసును కోల్డ్‌స్టోరేజీలపైకి నెట్టినట్లు ఆరోపణలు వినిపించాయి. విజిలెన్స్, పోలీసు అధికారులు పట్టుకున్నప్పుడు హాజరై శాంపిల్స్ తీసి కేసులు నమోదు చేసేందుకు మాత్రమే పరిమితమవుతున్నారు. జిల్లాలో తీసిన శాంపిల్స్ నాణ్యతా ప్రమాణాల పరిశీలన కోసం తెలంగాణకు పంపిస్తున్నారు.

శాంపిల్స్ పరీక్షించి నివేదికలు వచ్చేం దుకు జాప్యం జరగడంతో అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారు. జనవరి నుంచి డిసెంబర్ వరకు ఫుడ్ కంట్రోల్ అధికారులు అన్నిరకాల ఆహార పదార్థాల్లో 449 శాంపిల్స్ తీశారు. 97 శాంపిల్స్ సురక్షితం అని పరీక్షల్లో తేలాయి. వీటిలో 14 కేసులు నూనెలకుసంబంధించిన కేసులు ఉన్నాయి. 37అన్‌సేఫ్, 19 సబ్ స్టాండెడ్, 46 మిస్‌బ్రాండ్ వస్తువులుగా తేలాయి. వీటికి సంబంధించి కొన్ని కేసులు కోర్టులో నడుస్తుండగా, కొన్ని జాయింట్ కలెక్టర్ కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. గత జూలైలో మంగళగిరిలో పట్టుబడిన కల్తీ నెయ్యి, ఆదివారం గుంటూరులో పట్టుబడిన జంతు కొవ్వుల నూనె వ్యవహారం సంచలనం రేకెత్తించాయి. ఫుడ్ కంట్రోల్ అధికారులు నెలకు 30 నుంచి 40 శాంపిల్స్ తీయాల్సి ఉంది. అయితే ఈ శాంపిల్స్ తీసేందుకు వారికి వాహన సదుపాయం, సహాయ సిబ్బంది లేకపోవడంతోచట్టపరంగా చర్యలు తీసుకుంటున్నాం

# 292 గ్రామాల్లో నీటి కష్టాలు



ఒంగోలు, ఆగస్టు 7, (న్యూస్ పల్స్)వర్షాకాలం వచ్చినా పశ్చిమ ప్రకాశంతో పాటు తూర్పు ప్రకాశంలోనూ నీటి కష్టాలు అధికమయ్యాయి. ఆగస్టు నెల వచ్చినా జిల్లాలో చినుకు జాడ లేదు. పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు, కొండపి, దర్శి, యర్రగొండపాలెం పరిధిలో 292 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను ఏప్రిల్‌లో అధికారులు నీటితో నింపారు. జూలై చివరి వరకు నీటి ఇబ్బందులు ఉండవన్నారు. జూలై ముగిసి ఆగస్టు నెల వచ్చింది. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీరు అడుగంటింది. ఒకటి రెండు రోజులు మినహా ప్రజలకు నీరు అందే పరిస్థితి లేదు. ఈ లోపు సాగర్ నీటిని విడుదల చేయకపోతే నగర వాసులు నీటి కోసం మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.ప్రభుత్వం మాత్రం గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి, కనిగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో 419 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తోంది. ఇందులో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు మూడు నియోజకవర్గాల్లోనే 300 గ్రామాలు ఉండగా మిగిలిన మూడు నియోజకవర్గాల్లో 119 గ్రామాలు ఉన్నాయి. అయితే పై 6 నియోజకవర్గాల్లో వెయ్యి గ్రామాల్లో నీటి సమస్య అధికమైంది. ప్రభుత్వం మాత్రం మొక్కుబడిగా 419 గ్రామాల్లో మాత్రమే అరకొర నీటిని సరఫరా చేసి చేతులు దులుపుకుంటుంది. వేసవి ముగిసి వర్షాకాలం ప్రారంభమైనా జిల్లాలో చినుకు జాడ లేదు. దీంతో పశ్చిమ ప్రకాశంలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. వేలాది చేతి పంపులు, ప్రభుత్వ తాగునీటి పథకాలు నిరుపయోగంగా మారాయి.వర్షం వస్తే తప్ప ప్రజల తాగునీటి కష్టాలు తీరే పరిస్థితి లేదు. మనుషులతో పాటు పశువులకు నీరు అందడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పై మూడు నియోజకవర్గాల్లోనే దాదాపు 700 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు తూర్పు ప్రకాశంలోనూ నీటి కష్టాలు మొదలయ్యాయి. సాగర్ పరివాహక ప్రాంతంలో 292 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఉన్నాయి. ఏప్రిల్ నెలలో సాగర్ నీటితో అధికారులు ఈ ట్యాంకులను నింపారు. జూలై చివరి నాటికే ట్యాంకులు అడుగంటాయి. ప్రస్తుతం చుక్కనీరు లేదు. రెండు మూడు రోజుల్లో చెరువులు నీటితో నింపకపోతే సాగర్ పరివాహక ప్రాంత ప్రజలకు తాగునీరు అందే పరిస్థితి లేదు. ఇక ఒంగోలు నగరానికి ఇప్పటికే తాగునీటి ఇక్కట్లు తలెత్తాయి. నగర పరిధిలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీరు అడుగంటింది. మరో వారంలోపు పూర్తిగా నీరు ఆగిపోతుంది. అదే జరిగితే లక్షలాది మంది నగర వాసులకు తాగునీటి ఇబ్బందులు తీవ్రస్థాయికి చేరుతాయి.ఇప్పటికే కార్పొరేషన్ అధికారులు నగర వాసులకు అరకొర నీటిని మాత్రమే అందిస్తున్నారు. మూడురోజులకు ఒక మారు నీటి విడుదల అని పేరుకు చెబుతున్నా సక్రమంగా నీరు అందడం లేదు. గంటపాటు కూడా నీరు వదలడం లేదు. మళ్ళీ వారం రోజుల పాటు నీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. దీంతో ఇప్పటికే చాలా మంది ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. తక్షణం 4 టీఎంసీల సాగర్ జలాలు విడుదల చేయాలని అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తక్షణం నీటిని విడుదల చేయకపోతే పశ్చిమ ప్రకాశంతో పాటు తూర్పు ప్రకాశంలోనూ తాగునీటి ఇబ్బందులు పతాక స్థాయి కి చేరే ప్రమాదం ఉంది. ఈ ఏడాది జనవరి నెలలో 142 గ్రామాల పరిధిలో రోజూ 1214 ట్రిప్పుల నీటిని ప్రభుత్వం సరఫరా చేయగా, ఫిబ్రవరి నెలలో 178 గ్రామాల పరిధిలో 1591 ట్రిప్పులు, మార్చి నెలలో 247 గ్రామాల పరిధిలో 2492 ట్రిప్పులు, ఏప్రిల్‌లో 316 గ్రామాల పరిధిలో ప్రతి రోజు 3,308 ట్రిప్పుల చొప్పున నీటిని సరఫరా చేశారు. రాను రాను ఇది పెరిగింది. నాటికి జిల్లా వ్యాప్తంగా 419 గ్రామాల్లో రోజూ 4500 ట్రిప్పుల చొప్పున ప్రభుత్వం నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తోంది. వర్షాలు కురవక పోతే ఈ సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉంది. అయితే ప్రభుత్వం సరఫరా చేస్తున్న నీరు మొక్కుబడిగా కూడా ప్రజలకు అందడం లేదు. అధికారులు చూపిస్తున్న లెక్కల్లో చాలా మటుకు తప్పుడు గణాంకాలన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సాగర్ నీటిని విడుదల చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపాలి. పశ్చిమ ప్రకాశంలో నీరున్న ప్రాంతాల నుంచి తాగునీటి ఇబ్బందులున్న అన్ని గ్రామాలకు ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయాల్సి ఉంది.

# టీడీపీకి దగ్గరవుతున్న మాగుంట

ఒంగోలు, ఆగస్టు 7, (న్యూస్ పల్స్) వైసీపీ ఎంపీ.. పార్టీలోని ఇతర నేతల విషయం ఏమోకానీ, ముఖ్యమంత్రి జగన్ వద్ద మంచి పేరు, ఇమేజ్ కూడా ఉంది. అదే సమయంలో ప్రజల్లో మంచి సానుభూతి ఉంది. అయితే.. ఇప్పుడు ఆయన చేస్తున్న వ్యవహారాలు.. ఇటు పార్టీలోనూ.. అటు ప్రజల్లోనూ చర్చకు, రచ్చకు దారితీశాయి. ఇంతకీ విషయంలోకి వెళ్తే 2019 ఎన్నికలకు ముందు.. వైసీపీ తీర్థం పుచ్చుకున్న ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన నాయకుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి. పార్టీలోకి రావడంతోనే? ఒంగోలు వైసీపీ టికెట్‌ను సంపాయించుకుని పోటీ చేసిన జగన్ సునామీలో విజయం దక్కించుకున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ.. ఆ తర్వాత.. జిల్లా పార్టీలో చెలరేగిన.. అసంతృప్తులు.. నేతల మధ్య దూరం వంటివి.. మాగుంటను సైలెంట్ చేశాయి.అయినప్పటికీ.. వైసీపీలోని కొందరు ఆధిపత్య ధోరణిని ప్రదర్శించినప్పటికీ.. మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాత్రం తన పనితాను చేసుకుని పోయేవారు. కుదిరితే తన వర్గానికి పనులు చేసేవారు. లేదంటే.. మౌనంగానే వ్యవహరించారు. అయితే.. మాగుంట చారిటీస్ తరఫున ప్రజలకు ఏదో ఒక రూపంలో సేవ చేయడం మాత్రం మరిచిపోలేదు. ఇదిలావుంటే.. తాజాగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి వ్యవహారం.. పార్టీలో చర్చకు దారితీసింది. మాగుంటను వ్యతిరేకిం చే ఓ వర్గం? కొన్నాళ్లుగా.. ఆయన తన పాత పార్టీ.. టీడీపీతో టచ్‌లో ఉన్నారని, వారి వాట్సాప్ గ్రూపుల్లోనూ మాగుంటకు ప్రాధాన్యం ఉందనే విమర్శలు చేస్తున్నారు. అయితే.. ఈ విషయాన్ని ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, తాజాగా జరుగుతున్న పార్లమెంటు సమావేశాల సమయంలో.. ఢిల్లీలోని తన నివాసంలో మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఎంపీలకు విందు ఏర్పాటు చేశారట. అయితే.. సాధారణంగా. ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి కాబట్టి.. దీనిపై చర్చ ఎందుకు? అనే ప్రశ్న వస్తుంది. కానీ, మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఇచ్చిన పార్టీకి టీడీపీ ఎంపీలు హాజరయ్యారట. దీంతో ఈ విషయాన్ని వైసీపీ ఎంపీలు తీవ్రంగా పరిగణిస్తున్నారు. "ఇప్పటి వరకు ఆయనపై ఎన్నో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కళ్లతో చూశాం. అయినా.. టీడీపీ ఎంపీలను పార్టీకి పిలిచినప్పుడు.. మమ్మల్ని ఎందుకు పిలవాలి? ఇది చాలా సీరియస్ ఇష్యూ" అని ఒక సీనియర్ వైసీపీ ఎంపీ వ్యాఖ్యానించడం గమనార్హం.అయితే జిల్లాకే చెందిన మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డితో మాగుంట శ్రీనివాసులు రెడ్డికి తీవ్రమైన విభేధాలు ఉండడం, ఇటీవల ఏపీలో కాకుండా చెన్నైలో తన కొత్త వ్యాపార కార్యకలాపాలు విస్తరించడం లాంటివి అధిష్టానంతో ఆయనకు గ్యాప్ పెంచాయంటున్నారు. పైగా మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్‌తో పాటు అటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెద్దలతో టచ్‌లో ఉంటున్నారు. ఇక ఇప్పుడు మాగుంట తన వ్యాపారం కోసం ఏపీలో తమ పార్టీని నమ్మడం కంటే ఎక్కడ ఎవరితో అయినా సన్నిహితంగా ఉండాలన్న నిబంధనతోనే ముందుకు వెళుతున్నారని టాక్ ? ఆయన గత ఎన్నికలకు ముందు టీడీపీని వీడడం ఇష్టం లేకపోయినా వైసీపీ వాళ్లు అనేక హామీలు ఇచ్చి మరీ ఇటు వైపునకు తిప్పుకున్నారట. రేపటి రోజు ఆయన మళ్లీ అటు చూస్తారని కూడా చర్చలు స్టార్ట్ అయ్యాయి

## బియ్యపు మధుసూదనరెడ్డికి కష్టాలు

తిరుపతి, ఆగస్టు 7, (న్యూస్ పల్స్)అధికారంలో ఉన్న వారికే అన్నీ కష్టాలు. అందరినీ కలుపుకుని పోతేనే మళ్లీ గెలుపు తలుపు తడుతుంది. లేకుంటే ఇబ్బందులు తప్పవు. వైసీపీలో కొందరు ఎమ్మెల్యేలు ఇదేరకమైన ఇబ్బందులు పడుతున్నారు. నామినేటెడ్ పోస్టులతో వైసీపీలో ఊపు వస్తుందని భావిస్తే కొందరు ఎమ్మెల్యేలకు మాత్రం తీవ్ర అసంతృప్తిని కలిగించిందనే చెప్పాలి. హైకమాండ్ కు నమ్మకంగా ఉన్న ఎమ్మెల్యేలకు సయితం ఈసారి మొండిచేయి చూపారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి మొన్నటి ఎన్నికల్లో అనూహ్యంగా గెలిచారు. బొజ్జల కంచుకోటను బద్దలు కొట్టగలిగారు. ఒకరకంగా చెప్పాలంటే బొజ్జల ఫ్యామిలీ మీద గెలిచి రికార్డు సృష్టించారు. తనను ఎమ్మెల్యేగా చేసిన జగన్ పట్ల బియ్యపు మధుసూదన్ రెడ్డి కృతజ్ఞతగానే ఉంటారు. పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని రాష్ట్రంలోనే హైలెట్ చేస్తూ వస్తున్నారు.ఇటీవల నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశారు. అందులో శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్ పోస్టు ఒకటి. దీనికి బీరేంద్ర వర్మను ఛైర్మన్ గా నియమించారు. బీరేంద్ర వర్మ సత్యవేడు మండలానికి చెందిన వ్యక్తి. సంప్రదాయం ప్రకారం దశాబ్దాలుగా శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్ గా స్థానికులనే నియమిస్తున్నారు. కానీ ఈసారి స్థానికేతరుడిని నియమించడం బియ్యపు మధుసూదన్ రెడ్డికి తలనొప్పిగా మారింది. ఈ పోస్టును తన గెలుపునకు పనిచేసిన వారికి ఇప్పించాలని ఆయన అనుకున్నారు. ఈ మేరకు హామీ కూడా ఇచ్చారు.కానీ జిల్లా మంత్రి జోక్యంతో ఈ పోస్టును ఇతరులకు కేటాయించడంతో బియ్యపు మధుసూదన్ రెడ్డి అసంతృప్తికి గురయినట్లు తెలిసింది. ఇప్పటికే జిల్లా మంత్రితో కొంత గ్యాప్ ఉంది. ఈ నియామకంతో మరింత గ్యాప్ పెరిగిందంటున్నారు.

# కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా హర్షకుమార్

విజయవాడ, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)కాంగ్రెస్ పార్టీకి ఆంధ్రప్రదేశ్ లో ఎలాంటి ఆశలు లేవు. ఆ పార్టీ ఓటు బ్యాంక్ మొత్తం కూడా వైసిపి ఖాతాలో పడిపోయేలా చేశారు జగన్ మోహన్ రెడ్డి. దాంతో పాటు రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా చేసి ఎపి వాసులకు తీరని ద్రోహం కాంగ్రెస్ చేసిందనే మాట చరిత్రలో నిలిచిపోయిందనే చెప్పొచ్చు. అలా అని కాంగ్రెస్ చేసిన గాయం బిజెపి చెరిపే పని చేసిందా అంటే గత ఏడేళ్ళు గా లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రెండు జాతీయ పార్టీలకు ఇక్కడ స్కోప్ లేకుండా పోయింది. అయితే గతకొంతకాలం క్రితం బిజెపి దూకుడు గా వెళ్ళే సోము వీర్రాజు ను అధ్యక్షుడిగా చేసి ఏదైనా అవకాశం చిక్కక పోతుందా అని ఎదురుచూస్తుంది. మరోపక్క కాంగ్రెస్ రఘువీరా రెడ్డి స్థానంలో దళిత సామాజికవర్గానికి చెందిన సాకే శైలజానాథ్ కి పగ్గాలు అప్పగించి చూసింది. కానీ ఆయన వల్ల కూడా పార్టీకి ఎలాంటి ఊపు హస్తానికి కనిపించడం లేదు.ఇటీవల కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో పార్టీని పటిష్టం చేసే ఆలోచన సాగిస్తుంది. ఈ నేపథ్యంలో ఎపి కి కూడా నిత్యం ప్రజల్లో ఉండే చురుకైన నాయకత్వం కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఈ వేట లో అమలాపురం మాజీ ఎంపి జివి హర్ష కుమార్ సరైన వ్యక్తిగా కాంగ్రెస్ అధిష్టానానికి సమాచారం చేరినట్లు తెలుస్తుంది. విభజన తరువాత పార్టీనుంచి బహిష్కరించబడి ఆ తరువాత కిరణ్ కుమార్ రెడ్డి సమైక్యాంధ్ర పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి చెంది హర్షకుమార్ దానినుంచి బయటకు వచ్చి టిడిపి లో చేరి ఆ వెంటనే వెనక్కి వచ్చి కొంత కాలం మౌనం వహించారు.అయితే వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి పై కేసులకు సైతం వెరవకుండా వ్యతిరేక పోరాటం చేస్తూనే వచ్చారు. తమ సహచరులు, సన్నిహితుల వత్తిడితో తిరిగి కాంగ్రెస్ పార్టీ తీర్ధం పుచ్చుకున్న హర్ష కుమార్ ప్రజల్లో పార్టీకి మైలేజ్ లేకపోయినా ఎదో ఒక ఉద్యమాలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. ఎపి లో దళితుల సమస్యలు ఎక్కడ ఉన్నా అక్కడ ప్రత్యక్షం అయి ఉద్యమ బాటలోనే కాంగ్రెస్ ఓటు బ్యాంక్ తిరిగి తమ పార్టీకి తెచ్చే ప్రయత్నం కోసం శ్రమిస్తున్నారు. దాంతో హర్షకు పిసిసి కీరిటం పెడితే జగన్ పార్టీకి ఇబ్బందులు సృష్టించడంతో బాటు కోస్తాలో బలమైన ఎస్సి సామాజికవర్గాన్ని కాంగ్రెస్ కు దగ్గర చేయగలరని అధిష్టానం యోచన చేస్తున్నట్లు టాక్. అయితే ఈ పార్లమెంట్ సమావేశాలు ముగిశాక ఈ అంశంపై కాంగ్రెస్ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తుంది

# ఏడు జిల్లాల్లో కరువు

తిరుపతి, ఆగస్టు 8, (న్యూస్ పల్స్)మళ్లీ కరువు మేఘాలు కమ్ముకున్నాయి. రాయలసీమతోపాటు మొత్తం ఏడు జిల్లాల్లో దుర్భర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వర్షపాతం గణాంకాలే ఇందుకు నిదర్శనం. వైఎస్సార్ జిల్లాలో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. జూన్ ఒకటో తేదీతో ఆరంభమైన ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకూ చిత్తూరు, అనంతపురం, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో 20 నుంచి 59 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రాయలసీమ జిల్లాల్లో చినుకు లేకపోవడంతో నామమాత్రంగా సాగైన పంటలు కూడా వాడిపోతున్నాయి. అనంతపురం జిల్లాలో వేరుశనగ, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పత్తి మొక్కలు వాడిపోయాయి. జొన్న, పెసర తదితర పంటలు కూడా ఎండిపోతున్నాయి. చాలామంది రైతులు పొలాలను దున్ని పదును లేక విత్తనాలు వేయకుండా వదిలేశారు. రాయలసీమ జిల్లాల్లో వర్షాభావం వల్ల భూగర్భ జలమట్టం పాతాళంలోకి పడిపోయింది. బోర్లలో నీరు లేక పండ్ల తోటలు సైతం దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వైఎస్సార్ జిల్లాలో 60 శాతానికిపైగా వర్షపాతం లోటు ఉంది. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే రెండు నెలలు గడిచిపోయింది. వేరుశనగ విత్తనం వేసే సీజన్ కూడా దాటిపోయింది. ఈ ఖరీఫ్‌లో 23.07 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు కావాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా, ఆగస్టు రెండో తేదీ నాటికి 9.6 లక్షల ఎకరాల్లోనే విత్తనం పడింది. గత ఏడాది ఖరీఫ్‌లో దుర్భిక్షంతో పంటలు పోగొట్టుకుని అప్పుల పాలైన అన్నదాతలు ఈ ఏడాది ఖరీఫ్‌లో పరిస్థితి బాగుంటుందని, పంటలు పండించుకుని నాలుగు రూకలు కళ్లజూద్దామని ఆశపడ్డారు. చినుకు జాడ లేకపోవడంతో అవన్నీ అడియాశలవుతున్నాయి.వర్షాల్లేక సాగు విస్తీర్ణం దారుణంగా పడిపోయింది. పచ్చని పంటలతో కళకళలాడాల్సిన పొలాలన్నీ బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. అరకొరగా అక్కడక్కడా విత్తిన పంటలు కూడా తడిలేక వాడిపోతున్నాయి. కర్నూలు, వైఎస్సార్, చిత్తూరు, అనంతపురం, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో బీడు భూములు దుర్భిక్షానికి అద్దం పడుతున్నాయి.వేరుశనగ విత్తడం కోసం రైతులు విత్తనకాయలు కొనుగోలు చేసిన వాటిని వలిచి విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. సీజన్ దాటినా వర్షం జాడ లేకపోవడంతో వేరుశనగ పప్పును కిరాణా వ్యాపారులకు అమ్మేస్తున్నారు. ఇక వర్షం పడినా వేరుశనగ సాగుకు అనుకూలం కాదని, సీజన్ దాటిపోయినందున ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడమే ఉత్తమమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

## లీకుల వీరుల పని పట్టే పనిలో సర్కార్

విజయవాడ, ఆగస్టు 7, (న్యూస్ పల్స్)ఇది ప్రజాస్వామ్యం. ఇక్కడ ప్రజలే అసలైన ప్రభువులు. ఎవరికీ శాశ్వతమైన అధికారాలను జనాలు ఇవ్వలేదు. అలా ఎవరైనా అనుకుంటే మాత్రం పొరపాటు పడినట్లే. ఇదిలా ఉంటే ప్రభుత్వం అంటే అధికారులు ఉంటారు. వారి సహకారం కూడా అవసరం అవుతుంది. అధికారులను ప్రభుత్వ పెద్దలు నమ్మాలి. అలా కాకుండా వారిని అనుమానించడం మొదలుపెడితే మాత్రం పరిణామాలు తీవ్రంగానే ఉంటాయి. ప్రస్తుతం ఏపీలో వైసీపీ సర్కార్ వైఖరి చూస్తే అధికారులతో లడాయి పెట్టుకోవడానికే రెడీ అవుతోంది అంటున్నారు.ఆర్థికపరమైన విషయాలు లీక్ అవుతున్నాయని వైసీపీ సర్కార్ కుతకుతలాడిపోతోంది. అవును ప్రభుత్వం ఎక్కడ అప్పు చేస్తోంది, ఇప్పటిదాకా ఎక్కడ చేసింది అన్న వివరాలు తాటికాయంత అక్షరాలతో టీడీపీ అనుకూల మీడియాలో వస్తూంటే పాలకులకు ఎక్కడో కాలిపోతోందిట. దాని కంటే ముందు అది నామార్దా కదా. ఏకంగా ప్రభుత్వం పరువే పోతోంది. దాంతో ఈ లీకుల వీరులను సర్కార్ కనిపెట్టి పనిపట్టేసింది. అ విధంగా ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసేంది. దాంతో ఉద్యోగ వర్గాలలో పెద్ద ఎత్తున కలవరం రేగుతోంది.వెనకటికి ఎవరో మీకు బట్టతల ఉంది అన్నారట. దానికి ఆ పెద్ద మనిషి నేనంటే గిట్టని వారు ఆ మాట మీకు చెప్పారా అని మండిపడ్డారుట. ఇపుడు ఏపీ ఆర్థిక పరిస్థితి అన్నది బట్టతల మాదిరిగా అందరికీ కళ్ల ముందు కనిపిస్తోంది. ఫస్ట్ తారీఖునకు ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు అందుకుని ఎన్ని నెలలు అయింది. అలాగే కాంట్రాక్టర్ల బిల్లుల పే మెంట్ లేదు, మరో వైపు చూస్తే అభివృద్ధి కోసం ఖర్చు చేయడానికి పైసా ఆదాయం లేదు. ఇవన్నీ ఖజానా ఖళీని వెక్కిరించడంలేదా. కానీ వైసీపీ పెద్దలు మాత్రం దీనికి బాధ్యత అంటూ కొందరు అధికారుల మీద వేటు వేసి భయపెట్టాలని చూస్తున్నారు అంటున్నాయి విపక్షాలు.ఇది సాంకేతిక యుగం. ఏ సీక్రెట్ ని కూడా ఎవరూ దాచలేరు. ఇక ప్రభుత్వంలో పాలన అంటే ఒక విధంగా పారదర్శకంగానే సాగుతుంది. భారత్ లాంటి దేశాలలో చాలా విషయాలు అలా బయటకు వచ్చేస్తాయి.

## బుచ్చయ్య ఒంటరైపోయారా

రాజమండ్రి, ఆగస్టు 7, (న్యూస్ పల్స్)అసలే.. టీడీపీ కష్టాల్లో ఉంది. గత ఎన్నికల ఎఫెక్ట్ నుంచి ఇప్పటి వరకు పార్టీ కోలుకోలేక పోయింది. పైగా యాక్టివ్‌గా ఉండాల్సిన నాయకులు, ఎమ్మెల్యేలు చాలా మంది సొంత పనుల్లో బిజీగా ఉన్నారు. అలాంటప్పుడు యాక్టివ్‌గా ఉన్న ఒకరిద్దరికైనా.. పార్టీ నుంచి మద్దతు అవసరం కదా ? మరి ఈ విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కాని పరిస్థితి . మాట్లాడేవారికి మద్దతుగా నిలవాల్సిన నేతలు.. మౌనంగా ఉంటున్నారు. పోనీ..వారైనా మాట్లాడతారా? అంటే అది కూడా లేదు. మరి ఈ సమయంలో సదరు నేతలకు నైతిక మద్దతు ఎక్కడ నుంచి వస్తుంది? అనేది కీలక ప్రశ్న. పైగా పార్టీలో దశాబ్దాల అనుభవం ఉన్న వారిలో కూడా బాబు కోటరిలో ఉన్న వారికే ప్రాధాన్యత ఉండే తప్పా.. మిగిలిన వారిని పట్టించుకునే వాళ్లు లేరన్న విమర్శలు ఉన్నాయి.ఈ విషయం అంతా రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గురించే ..! బుచ్చయ్య చౌదరి రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి వరుస విజయాలు దక్కించుకున్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ సునామీని సైతం తట్టుకుని ఆయన విజయం దక్కించుకున్నారు. సభలో ప్రతిపక్ష పార్టీ ఉప నేతగా అయితే అవకాశం చిక్కించుకున్నా.. నియోజకవర్గంలో రాజకీయాలకు , ఆయనకు మధ్య దూరం పెరుగుతోంది. కీలక నేతలు ఎవరూ కూడా గోరంట్ల బుచ్చయ్య చౌదరి వైపు ఉన్నట్టు కనిపించడం లేదు. ఈ అసహనంతోనే ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని అయిష్టంగానే ప్రకటన చేసినట్టు తెలుస్తోంది.అదే సమయంలో రాజమండ్రి సిటీపైనా త08 న ఆధిపత్యం ప్రదర్శించాలనే ధోరణితో గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎవరూ కూడా ఆయనకు సహకరించడం లేదని, ఆయన గట్టి వాయిస్ వినిపిస్తున్నా? ఆయనకు మద్దతుగా కోరస్ కలుపుతున్న నాయకులు కనిపించడం లేదు. ఇక పార్టీలో సీనియర్‌గా ఉన్నప్పటకి అటు పార్టీ విధివిధానాల్లోనూ గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాటలను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ అసంతృప్తి కూడా ఆయనలో ఉంది. తాజాగా.. అమరావతి భూముల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సీఎం జగన్ రాజీనామా చేయాలని గోరంట్ల బుచ్చయ్య చౌదరి డిమాండ్ చేశారు.ఇది మంచి సబ్జెక్టే. పైగా టీడీపీకి కలిసి వచ్చే సబ్జెక్టే. అయినప్పటికీ.. గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి వచ్చిన నాయకులు, ఆయనకు మద్దతుగా మాట్లాడిన నాయకులు ఒక్కరంటే ఒక్కరు కూడా కనిపించలేదు. దీంతో గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఒంటరయ్యారా ? అనే సందేహాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మరి చంద్రబాబు గోరంట్ల బుచ్చయ్య చౌదరిను ఎలా సంతృప్తి పరుస్తారో ? చూడాలి.

## పంటపోలాలను తొలగించిన అధికారులు

**ప్రభుత్వ భూమిలో పంటలు వేసిన రైతులు**

అనంతపురం ఆగస్టు 7, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కేశవాపురం - కొప్పలకొండ గ్రామాల్లో పెన్నా నది పరివాహక ప్రాంతంలో రైతులు సాగు చేసిన పంటలను అధికారులు తొలగించారు. అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం కేసవపురం-కోప్పలకొండ గ్రామాల సమీపంలో ఉన్న పెన్నానది పరీవాహక ప్రాంతమైన సర్వే నెంబర్ 616 లో 351.71 ఎకరాలు, 676-1 సర్వే నెంబర్ లో 364.40 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. అయితే ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారని, వెంటనే పంటలు తొలగించుకోవాలని పలుమార్లు రెవెన్యూ అధికారులు రైతులకు నోటీసులు ఇచ్చారు. అయితే లక్షలు పెట్టి సాగు చేసుకోవడం వల్ల పంటలను రైతులు తొలగించుకోలేక పోయారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, విద్యుత్ అధికారులు, పోలీసు సిబ్బంది సహకారంతో జెసిబిలతో పంటలను తొలగించారు. పంటలు తొలగించవద్దని రైతులు అధికారుల కాళ్ళ, వెళ్ళా పడ్డా కనుకరించలేదు. . దీంతో కళ్ళ ముందు కొడుకులా సాగు చేసుకున్న పంటలను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నా చేసేది లేక కన్నీటి పర్యంతం అయ్యారు. పంటలతో పాటు పైపులు, డ్రిప్ పరికరాలు ధ్వంసం అయ్యాయని రైతులు వాపోయారు. ఆఖరికి మీడియాను కూడా ఘటన స్థలానికి అనుమతించలేదు.. అనంతపురం డీఎస్పీ రాఘవ రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

## పీఎంపీ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

నెల్లూరు ఆగస్టు 7, (న్యూస్ పల్స్)స్థానిక వెంగళరావు నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నెల్లూరు జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా హాస్పిటల్ వైద్యాధికారి డా.సాయి సందీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రోజు తో తల్లిపాల వారోత్సవాలు ముగింపు రోజు సందర్భంగా పీఎంపీ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలే తొలి టీకా అని, బిడ్డ రోగనిరోదక శక్తికి ముర్రుపాలు శ్రేష్టమైనవని పేర్కొన్నారు. తల్లిపాలలో ఎన్నో అమూల్యమైన పోషకాలు ఉంటాయని, వీటిలో చాలా శక్తివంతమైన యాంటీబాడిస్ ఉంటాయని తెలిపారు.

అనంతరం హాస్పిటల్ కో.ఆర్డినేటర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒకటో తారీకు నుండి శనివారం వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించామని, ముగింపురోజు పీఎంపీల ఆర్థిక సహకారంతో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్నామని, ప్రతి గర్భిణీ నెల నెలా క్రమంతప్పకుండా పరీక్షలు నిర్వహించుకుంటూ, మందులతోపాటు, తాజా పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్లు తీసుకోవాలని, రక్తహీనత రాకుండా ఆకుకూరలు, శనగ ముద్దలు తీసుకోవాలని, సుఖప్రసవం కోసం ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్లో చేరి కాన్పు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పీఎంపీ అధ్యక్ష, కార్యదర్సులు శాఖవరపు వేణుగోపాల్, షేక్ సత్తార్, నెల్లూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్సులు జి.శేషయ్య, డి. శ్రీనివాసులు, రూడ్స్ అధ్యక్షులు షేక్ రసూల్, సభ్యులు జె.వసుంధర, జడ్పీ వాకర్స్ కార్యదర్శి. మెట్టు సుధాకర్ రెడ్డి, ఏఎన్ఎం రేవతి, అమరావతి, ప్రశాంతి, మలేశ్వరి, గాయత్రి, అన్నమ్మ,రూడ్స్ సభ్యులు రాజేష్, నారాయణ, సుబాహాన్. తదితరులు పాల్గొన్నారు.

# 13న బ్రాహ్మణ భవన సముదాయాల కు శంకుస్థాపన

**శ్రీ శ్రీ విద్యా శంకర భారతి స్వామి రాక**

నెల్లూరు స్థానిక మనుమసిద్ధి నగర్ ప్రాంతంలో ఉన్న పాత మున్సిపల్ ఆఫీస్ సమీపంలో బ్రాహ్మణ భవన సముదాయాలకు శ్రీ శ్రీ శ్రీ పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ స్వామి వారి స్వహస్తాలతో వైభవంగా శంకుస్థాపన కార్యక్రమం ఈనెల 13న నిర్వహించబడుతుందని బ్రాహ్మణ సేవా సంఘాల సమితి పేర్కొంది. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో బ్రాహ్మణ భవన సముదాయ నిర్మాణానికి జిల్లాలోని బ్రాహ్మణ సేవా సంఘాలు మరియు బ్రాహ్మణులు ఐక్యత గా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోన రఘుపతి, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మల్లాది విష్ణు, ఆంధ్రప్రదేశ్ ఐటి మరియు పరిశ్రమల శాఖ మాత్యులు మేకపాటి గౌతమ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మాత్యులు పి అనిల్ కుమార్ యాదవ్, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు గ్రామీణ నియోజవర్గ యూత్ సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలియజేశారు. బ్రాహ్మణ భవన శంకుస్థాపన కార్యక్రమం పూర్ణకుంభంతో, మంగళ వాయిద్యాలతో, వేదపండితుల మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా నిర్వహించబడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమానికి కి రాష్ట్ర బ్రాహ్మణ సంఘ నాయకులు, జిల్లా బ్రాహ్మణ సంఘం కార్యవర్గ సభ్యులు, జిల్లా మహిళా విభాగం సభ్యులు, జిల్లా అర్చక సమాఖ్య సభ్యులు, జిల్లా అర్చక పురోహిత విభాగ కార్యవర్గ సభ్యులు, జిల్లా యువజన విభాగ కార్యవర్గ సభ్యులు, నెల్లూరు నగర యువజన విభాగం కార్యవర్గ సభ్యులు, బ్రాహ్మణ అనుబంధ సంఘాల సభ్యులు మరియు సానిక బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షులు గుడ్ల దొన వాసుదేవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు కె. పద్మావతి, ఉపాధ్యక్షురాలు ఐ జయలక్ష్మి, కార్యదర్శి జి జయలక్ష్మి, సభ్యులు నాగలక్ష్మి ,నాగజ్యోతి, ప్రతిభ రాణి తదితరులు పాల్గొన్నారు.

## అలీషా మృతికి బాధ్యులైన ఎక్సైజ్ సీఐనీ సస్పెండ్ చేయాలి

**మృతుని కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం**


**కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి**

**అలిషా ది హత్య లేక ఆత్మహత్య విచారణ చేపట్టాలి**

**నూర్ భాషా సంఘం డిమాండ్**

నెల్లూరు ఆగస్టు 7, (న్యూస్ పల్స్)నూర్ భాషా కులానికి చెందిన షేక్ అలీషా మృతికి కారణమైన గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం బట్రూ పాలెంలో ఎక్సైజ్ సి. ఐ. కొండా రెడ్డి ని వెంటనే సస్పెండ్ చేసి, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలనీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నూర్ భాషా/దూదేకుల బి. సి. ముస్లిం సంక్షేమ సంఘం,నెల్లూరు జిల్లా శాఖ అధ్యక్షులు షేక్ సలీం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక శాంతి నగర్ లోని ఆ సంఘ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలీషా నిర్వహిస్తున్న డాబా వద్దకు వెళ్లి పలుమార్లు నగదు డిమాండ్ చేయడం తనకు తోచింది , ఇచ్చిన పెద్ద మొత్తంలో సి ఐ డిమాండ్ చేయడంతో తాను ఇవ్వలేనని చెప్పినందుకు, అతనినీ జీవుల్లో ఎక్కించుకొని దారుణంగా కొట్టి చిత్రహింసలు చేశారని ఆయన ఆరోపించారు. అలాగే ముందుగానే సి. ఐ. పక్క రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలు జీపులో పెట్టుకుని ఇవి తనవేనని ఒప్పుకో మంటు ఆలీషా రెండుకాళ్ళ పై వాహనాన్ని ఎక్కించడం ఆటవిక చర్యగా ఆయన పేర్కొన్నారు. ఆ మరుసటి రోజు అతను మృతి చెందారని ఆయన అన్నారు.ఆ కుటుంబానికి అలీషా ఒక్కడే జీవనాధారం అని ,అతని మృతితో ఆ కుటుంబం రోడ్డున పడిందని, అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబానికి కోటి రూపాయలు పరిహారంతో పాటు, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించి, న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ,రాష్ట్ర హోం శాఖ మంత్రి ఈ ఘటనపై, పూర్తిస్థాయిలో ఆలీ భాషా ది ఎక్సైజ్ శాఖ చేసిన హత్యనా, లేక అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడా అన్నది పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో పాటు ఎక్సైజ్ శాఖ సీఐ కొండారెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూర్ భాషా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖాదర్ బాషా , బాబర్ జాన్ , మహబూబ్ బాషా , మస్తాన్ వలి , లతీఫ్ ,హుస్సేన్ సాహెబ్ , ఖాజావలీ , షేక్ మస్తాన్ సాహెబ్ , షేక్ మస్తాన్ , షేక్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# కరోనా థర్డ్‌వేవ్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి: మంత్రి



బళ్లారి(కర్ణాటక): కొవిడ్ థర్డ్‌వేవ్‌ను ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధం కావాలని, ప్రతి తాలూకాలో ఆక్సిజన్‌తో కూడిన బెడ్ల ఏర్పాటు చేయాలని బళ్ళారి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనంద్ సింగ్ అధికారులుకు సూచించారు. మంత్రిహోదా చేపట్టిన తరువాత తొలిసారిగా శుక్రవారం బళ్లారి విచ్చేసిన ఆయన జిల్లాధికారి సభాంగణంలో ప్రగతి పరిశీలనా సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించి మాట్లాడారు. వైద్య నిపుణుల సూచనలు మేరకు ఇప్పటికే రాష్ట్రంలో కొవిడ్ థర్డ్‌వేవ్ వచ్చే అవకాశం ఉందని సూచించిన నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందని, ఈ దిశలో కోవిడ్ కేసులు పెరుగుతున్న జిల్లాల్లో అధికారులను అప్రమత్తం చేస్తూ కోవిడ్ థర్డ్‌వేవ్ ఎదుర్కొనేందుకు అవసరమైన ఏర్పాటు సిద్ధం చేసుకోవాలని జిల్లాధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బళ్ళారి, విజయనగర ఉభయ జిల్లాలో కోవిడ్ కేసులు పెరగకుండా జిల్లా వైద్యశాఖ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారానే కోవిడ్ నిర్మూలన సాధ్యమన్న మంత్రి ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 80శాతం వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి అయిన నేపథ్యంలో జిల్లాలో కోవిడ్‌ను నియంత్రించ వచ్చనే అభిప్రాయం వైద్యనిపుణులు అభిప్రాయ పడుతున్నారని, సార్వజనికులు వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా కోవిడ్‌ను అరికట్టేందుకు జిల్లాయంత్రాంగంతో సహకరించాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు డిడికేటెడ్ కొవిడ్ ఆసుపత్రులు(డీసీహెచ్), డెడికేటెడ్ కోవిడ్ హెల్త్‌కేర్ సెంటర్(డీసీహెచ్‌సీ)తో పాటు మొత్తం 36 కోవిడ్ ఆసుపత్రులు ఉన్నట్లు తెలిపారు. 40 కోవిడ్ కేర్ సెంటర్లలో మొత్తం 3170 బెడ్‌లు అందుబాటులో ఉన్నాయని జిల్లాధికారి పవన్‌కుమార్ మాలపాటి మంత్రికి వివరించారు. విమ్స్‌లో ఒక నిముషానికి వెయల్యి లీటర్ల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా, న్యూ డెంటల్ కళాశాలలో 500 లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేసే యూనిట్‌ను, హడగలిలో 500లీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను జిందాల్ సహాయంతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో జిల్లా పంచాయతీ సీఈఓ కేఆర్ నందిని, జిల్లా ఎస్పీ సైదుల్లా అదావత్, సిటీ కార్పొరేషన్ కమిషనర్ ప్రీతి గెహ్లోట్, జిల్లా సహాయాధికారి మంజునాథ్, డీహెచ్ఓ డాక్టర్ జనార్ధన్, కమిషనర్ ఆకాశ్ శంకర్, జిల్లా సర్జన్ బసరెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# 200 మంది చేనేత కుటుంబాలకు బిజెపి మహిళా మోర్చా చేయూత

**ఖాదీ పంచెలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ**

నెల్లూరు ఆగస్టు 7, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా కోవూరు మండలం పరిధిలోని పాటూరు గ్రామంలో గుర్తించబడిన నిరుపేద చేనేత కుటుంబాల వారికి భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా కార్యవర్గ నెల్లూరు శాఖ తన సహకారం అందించింది . ఈ సందర్భంగా ఖాదీ పంచెలు , వివిధ రకాల పండ్లు బిస్కెట్ ప్యాకెట్ లను అందజేశారు . ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి పాటూరు గ్రామంలోని సుమారు 2 వందల పైచిలుకు చేనేత కుటుంబాల వారిని ప్రత్యేకంగా సందర్శించి , వారి కుటుంబ ఆర్థిక స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా చేనేతే.. మా ప్రతిష్ట.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాలతో,రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, ఉపాధ్యక్షులు సురేంద్ర రెడ్డి, జాతీయ,రాష్ట్ర. మహిళా మోర్చా అధ్యక్షులు నిర్మలా కిశోర్ తదితరుల పిలుపుతో, జిల్లా అధ్యక్షులు భరత్ కుమార్ యాదవ్, మహిళా మోర్చా అధ్యక్షులు రాజేశ్వరి. కండికట్ల. ఆధ్వర్యంలో, శనివారం జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో నెల్లూరు జిల్లా మహిళా మోర్చా టీమ్ పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు . ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మగ్గాల పనులు లేక, గ్రామాల్లో ఇతర పనులు చేయలేక , ఆరోగ్యం సరిగలేక నేత మగ్గం పని చేయలేక,ఉన్నటువంటి పెద్దలకు,ఖాదీ పంచలు, పండ్లు, బిస్కెట్లు. పంచి చిరు సన్మానం చేయడం ,మహిళా చేనేత కార్మికురాలిని, ప్రత్యేకంగా సన్మానించడం ఆనందదాయకం అన్నారు . ప్రభుత్వం ప్రకటించిన చేనేత అభివృద్ధి సంక్షేమ పథకాలను త్వరితగతిన విడుదల చేసి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి మహిళా మోర్చా ఉపాధ్యక్షులు జి విజయ శ్రీ , కె సుభాషిని, ప్రధాన కార్యదర్శి బి లక్ష్మీ ప్రసన్న, కార్యదర్శి నాగవేణి, బి లక్ష్మీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవి మరియు స్థానిక చేనేత కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

## రుయా ఆసుపత్రిలో మరణాల కేసు

**మృతుల సంఖ్య 23**

అమరావతి ఆక్సిజన్ కొరత కారణంగా కారణంగా మే 10వ తేదీ రాత్రి రుయా ఆస్పత్రిలో జరిగిన మరణాలపై హైకోర్టులో ఈరోజు ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా ఆక్సిజన్ సరఫరా చేసే కంపెనీ పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపింది. మృతుల సంఖ్య 23 గా తేల్చి చెప్పింది . గతంలో మే 10 వ తేదీన మాత్రమే 11 మంది మాత్రమే ఆక్సిజన్ కొరతతో మరణించారని జిల్లా కలెక్టర్ స్వయంగా చెప్పినప్పటికీ తర్వాత ప్రజా సంఘాల ఆందోళన లు,రాజకీయ పార్టీలు కోర్టుకు వెళ్ళడంతో కోర్టు ఆదేశాల మేరకు మరణాల సంఖ్యను 23కు తేల్చారు. అయితే ఆరోజు ఆక్సిజన్ కంపెనీ నిర్లక్ష్యం వల్లనే సకాలంలో ఆక్సిజన్ రాలేదని చెబుతున్న అధికారులు ఆక్సిజన్ రానప్పుడు ముందుగా ప్రత్యామ్నాయ మార్గాలు ఎందుకు తీసుకోలేదు అన్న విషయంపై ఇప్పుడు పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఇందుకు సంబంధించి ఆక్సిజన్ మానిటరింగ్ కోసం ఓఅదికారిని నియమించారు. అయితే ఆరోజు అధికారులు తీసుకున్న చర్యలు గురించి వివరించలేదు.

## ఒంగోలు రిమ్స్ లో దారుణం

**నర్సు పై లైంగిక దాడి**

ఒంగోలుఆగస్టు 7, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లా ఒంగోలు రిమ్స్ లో దారుణం జరిగింది. అందరూ చూస్తుండగానే నర్సుపై లైంగిక దాడికి పాల్పడ్డాడు కోవిడ్ బాధితురాలి బంధువు.వార్డు లోనే నర్సుతో అసభ్యకరంగా ప్రవర్తిం చాడు. అటు నిందితుడుని అడ్డుకున్న వార్డులోని రోగులు, వారి బంధువులు నర్సును కాపాడారు. ఈ దృశ్యాలు ఆసుపత్రిలోని సీసీ కెమరాల్లో రికార్డ య్యాయి. బాధితురాలి నుంచి స్టేట్మెంట్ తీసుకున్న పోలీసులు నిందితుడు విజయ్ కుమార్ ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ఈ కేసులో వెంటనే కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

## మారు వేషంలో సబ్ కలెక్టర్

**రెండు ఎరువ్యల దుకాణాలు సీజ్**

విజయవాడ ఆగస్టు 7, (న్యూస్ పల్స్)విజయవాడ సబ్ కలెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ మారు వేషంలో సంచరించారు. సాధారణ రైతు వేషంలో కైకలూరులోని ఎరువుల షాపులకు వెళ్లిన సబ్ కలెక్టర్ అక్కడ ఒక దుకాణంలోకి ఎరువులు కావాలని అడిగారు . అయనకు ఓ దుకాణంలోకి వెళ్లిన సబ్ కలెక్టర్ కు స్టాక్ ఉన్నా లేవని యజమాని చెప్పాడు. అక్కడి నుండి మరో షాపుకు వెళ్లి ఎరువులు కావాలని అడిగారు. సబ్ కలెక్టర్ అడిగిన ఎరువులు ఇచ్చి సదరు షాపు యజమాని ఎంఆర్పీ ధర కన్నా అధికంగా వసూళ్లు చేసిన వసూళ్లు చేసాడు. సొమ్ముకు బిల్లు సైతం ఇవ్వలేదు. ఆ తర్వాత సబ్ కలెక్టర్ ఒకొక్క అధికారికి ఫోన్ చేసి ఎరువుల షాపుకు పిలిపించారు. రెండు షాపులను సీజ్ చేయించారు. అక్కడి నుండి అధికారులతో కలిసి ముదినేపల్లిలో ఎరువుల షాపుల తనిఖీకి వెళ్లారు. ముదినేపల్లిలో సబ్ కలెక్టర్ వెళ్లిన షాపు మూసి వేసి ఉండటంతో అక్కడి రైతులను సబ్ కలెక్టర్ వాకబు చేసారు. ఎంఆర్పీ ధరల కన్నా అధికంగా అమ్ముతున్నారని రైతులు సబ్ కలెక్టర్ కు తెలిపారు. షాపు యజమానిని పిలిపించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

కడప ఆగస్టు 7, (న్యూస్ పల్స్)కడప జిల్లాలో అర్ధరా త్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, ఇన్నోవా వాహనం ఢీ కొన్నాయి. మైదుకూరు-బద్వేలు రహదారిపై బ్రహ్మంగారిమఠం మండలం అగ్రహారం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందా రు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని కడప సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జ అయింది. ఇందుకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతపురం నుంచి టమోటాలతో విజయవాడ వెళ్లేందుకు మైదుకూరు, బద్వేలు వైపునకు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఇన్నోవా వాహనాన్ని ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు.ఈ ప్రమాదంలో మరణించిన ముగ్గురిని సద్దాం, రేష్మ, సల్మాలుగా గుర్తించారు. మరోకరి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్టుగా పోలీసులు తెలిపారు.

## అనంతపురం జిల్లాలో చిరుత కలకలం

అనంతపురంఆగస్టు 7, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామ శివారులోని చౌడమ్మ కొండ సమీపం లోని ఓ పెద్ద గుండు పై చిరుత కలకలం.రోడ్డు మార్గాన వెళ్లే రైతులు, సెల్ ఫోన్ లలో చిత్రీకరించారు. చిరుత ను చూసి బయన్దోళనకి గురైన పాల వెంకటాపురం గ్రామ ప్రజలు. వన్యమృ గాల నుండి అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టి ప్రజల, మూగజీవాల ప్రాణాలను రక్షించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.నిత్యం పంట పొలాల కు వెళ్లాలంటే ప్రాణలాను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని పలువు రు రైతులు ఆవేదన చెందుతున్నారు.

## పంటపోలంలో యువకుడి ఆత్మహత్య

విశాఖపట్నంఆగస్టు 7, (న్యూస్ పల్స్)నక్కపల్లి మండలం పెద్దదొడ్డుగోళ్లు పంటపొలంలో ఉరి వేసుకొని యువకుడు అనుమానుస్పద మృతి చెందాడు. నక్కపల్లి మండలం సీతమ్మ పాలెం గ్రామానికి చెందిన పల్లా కృష్ణగా గుర్తించారు. మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీశైలం జలాశయం వద్ద టిడిపి పార్టీ శ్రేణుల ఆందోళన

కర్నూలు ఆగస్టు 7, (న్యూస్ పల్స్)శ్రీశైలం జలాశయం వద్ద టిడిపి పార్టీ శ్రేణుల ఆందోళనకు దిగారు. కృష్ణ జలాల ఆంధ్ర తెలంగాణ నీటి వాటాల పంపకాలలో రాయలసీమ ప్రాంతానికి అన్యాయం జరిగిందని ఆందోళన చేపట్టారు. సుండిపెంట నుంచి శ్రీశైలం డ్యాం వరకు బైక్ ర్యాలీతో బయలుదేరారు. మాజీ టీడీపీ శాసనసభ్యులు, మంత్రులు, నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు.

## రాట్నాలమ్మను దర్శించుకున్న పీవీ సింధు

ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలోని శ్రీ రాట్నాలమ్మ వారిని క్రిడాకారిణీ పీ వీ సింధు శనివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అభినందించారు. ఈ కార్యక్రమంలో పివి సింధు మాట్లాడు తూ ఒలింపిక్స్ కి వెళ్లేముందు రాట్నాలమ్మ వారిని దర్శించుకుని వెళ్లాను. అమ్మవారి ఆశీస్సులు, మీ అందరి ఆశీస్సులు వల్లనే కాంస్య పతకాన్ని గెల్చుకున్నానని అన్నారు. జరగబోయే ఒలింపిక్స్ లో మరెన్నో పతకాలు పొందాలని అమ్మవారిని కోరుకున్నా అంటూ అందరికీ ధన్యవాదాలు తెలిపింది..

## జీవీఎంసీ కార్యాలయన్ని ముట్టడించిన విపక్షాలు

విశాఖపట్నం విశాఖ జీవీఎంసీ కార్యాల యం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆస్తి పన్ను పెంపును నిరసిస్తూ జీవీఎంసీ కార్యాలయాన్ని టీడీపీ, జనసేన, సీపీఎం కార్పొరేటర్లు ముట్టడించారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.పన్ను నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వేలాది వినతులు వచ్చిన వాటికి కాదని పన్ను భారాన్ని పెంచడంతో సుమారు 700 కోట్లు భారం పడుతుందని సీపీఎం కార్పొరేటర్ గంగారాం అన్నారు.

# భక్తుల ఆభరణాలపై కన్నేసిన పూజారి

## అర్థరాత్రి వేళల్లో దొంగతనానికి ప్రయత్నం

కర్నూలు ఆగస్టు 8, ( విభారె) కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పులికొండ గ్రామం లో రంగస్వామి దేవాలయం దర్శనమునకు వచ్చిన మహిళ భక్తుల ఆభరణాలను దొంగతనానికి ఆలయ పూజారి ప్రయత్నించాడు. ఆస్పరి మండలం చెందిన భక్తులు స్వామికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చి రాత్రి ఆలయంలోనే నిద్రించి ఉదయనే దైవ దర్శనం చేసుకొని తమ ఊర్లకి పోవాలని ఆలయంలో రాత్రి నిద్రించారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలో నిద్రిస్తున్న మహిళ ఆభరణాలను అర్ధరాత్రి దొంగలించడానికి ఆలయ పూజారి ప్రయత్నించాడు. అప్రమత్తమైన మహిళలు. పూజారిని పట్టుకున్నారు. భక్తులు, గ్రామస్తులు దేహశుద్ధి చేసారు. ఆలయ సిబ్బంది మాత్రం పూజారి చేసిన ఈ నిర్వాహకని బయటకు పొక్కకుండా కప్పిపుచ్చే ప్రయత్నం చేసారు. దేవాలయంలో సీసీ ఫుటేజ్ లో అర్ధరాత్రి పూజారి భక్తులు నిద్రిస్తున్న దగ్గర తిరుగుతున్న దృశ్యాలు. పూజారి పట్టుకోవడానికి పరిగెడుతున్న భక్తులు సీసీ ఫుటేజ్ లో రికార్డ్ అయ్యాయి. భక్తుల ఆభరణాలు దొంగతనానికి ప్రయత్నించిన పూజారిపై ఎండోమెంట్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టపోవడం గమనార్హం.

# కోవిడ్ మెగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ రఘురామి రెడ్డి

తుగ్గలి ఆగస్టు 8, ( విభారె) కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ వారు పెద్ద ఎత్తున కోవిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం రోజున మండల పరిధిలోని పెండేకల్ సబ్ సెంటర్ నందు వైద్య శాఖ అధికారులు గర్భవతులకు నిర్వహిస్తున్న కోవిడ్ మెగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రఘురామి రెడ్డి పరిశీలించారు. అదేవిధంగా మండల కేంద్రమైన తుగ్గలిలో గల ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ను పరిశీలించి, వ్యాక్సినేషన్ కార్యక్రమంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సినేషన్ కార్యక్రమం అన్ని ప్రతి ఒక్కరూ తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి పి. హెచ్.సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఏఎన్ఎం లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు మరియు గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

# బిడ్డకు తల్లీపాలే ఆరోగ్యం

## ఇన్నర్ వీల్ అధ్యక్షులు రాధారెడ్డి

డోన్ ఆగస్టు 8, ( విభారె)బిడ్డకు తల్లీ పాలే ఆరోగ్యం అనీ ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు రాదా రెడ్డి అన్నారు, స్థానిక డోన్ మండలం సిసమగుంతల గ్రామంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం గర్భిణీ స్త్రీలకు పోషక పదార్థాలు అందించారు, ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు రాదా రెడ్డి మాట్లాడుతూ తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా తల్లులకు పోషక పదార్థాలు అందించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు, గర్భిణులు బిడ్డకు పాలు ఇవ్వలని, అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో సుమిత్ర, శైలజ, సరళ, హెల్త్ అసిస్టెంట్ సువర్ణ, శివమ్మ లు పాల్గొన్నారు

# కోవిడ్‌బి19 దృష్ట ప్రభుత్వ నిబంధనల మేరకు దర్శన వేళలు మార్పులు

కౌతాళం ఆగస్టు 8, ( విభారె) మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాలను అందరు సహకరించి జయప్రదం చేయాలని ఈ ఓ వాణి, ఎస్ ఐ మన్మధ విజయ్ తెలిపారు. కోవిడ్ ఉన్నందున భక్తా దులకు స్వామివారి దర్శనానికి మార్పులు చేయడం జరిగినది విలేకరుల సమావేశంలో ఆలయం ఈవో వాణి గారు మండల ఎస్సై మన్మధ విజయ్ పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ శ్రీ శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం ఉరుకుంద శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా దేవాలయమునకు శ్రీ స్వామివారి దర్శనమునకు విచ్చేయు ప్రతి భక్తుడికి తెలియజేయడమేమనగా కోవిడ్‌బి19 దృష్ట ప్రభుత్వ నిబంధనల మేరకు దర్శనం కు వచ్చే భక్తులకు సూచనలు65 సంవత్సరాలు పైబడినవారు అనారోగ్యంతో బాధపడుతున్న వారు గర్భిణీ స్త్రీలు మరియు 10 సంవత్సరాల లోపు పిల్లలు దర్శనానికి అనుమతించబడదని, ఆలయం ప్రవేశం చేయు ప్రతి వ్యక్తి తప్పనిసరిగా మాస్కులు ధరించి ఒకేచోట సమూహముగా ఉ ఒడకూడదని భక్తులు ఎవరు కూడా ఎల్. ఎల్. సి. కాలువలో స్నానం చేయరాదని దుకాణాలు క్యాంటీన్లు వంటివి దేవాలయ ఆవరణ బయట ఏర్పాటు చేయవలెనని అట్టి దుకాణాల వద్ద కూడా భక్తులు దూరం పాటించవలెనని భక్తులకు తీర్థ ప్రసాదములు వితరణ శాటరి పవిత్ర జలం చల్లుట వంటివి ప్రస్తుతం నిలుపుదల చేయడమైనది గర్భాలయ దర్శనాలు నిలిపివేయడం జరిగినది గదులు అద్దెకు ఇవ్వబడువు అని దేవస్థాన పరిసర ప్రాంతాలలో రాత్రి సమయంలో నిద్ర చేయడానికి వీలు లేదని దేవాలయం ప్రవేశం నుండి దర్శనం ప్రసాదం కౌంటర్ అన్నదానం క్యూలైన్లో భౌతిక దూరం కనీసం 6 అడుగులు పాటించవలెనని దేవాలయం ప్రాంగణంలో

**భక్తులు అందరూ సహకరించాలని ఆలయం ఈవో వాణి**

**అసంఘటిత చర్యలు జరకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం ఎస్ ఐ మన్మధ విజయ్**

భక్తులు కూర్చునే ప్రదేశములలో కూడా భౌతిక దూరం పాటించవలెనని ఆలయ ప్రాంగణంలో, దేవస్థానంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఉండకూడదని కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున సామూహిక ప్రార్థనలు భోజనాలు చేయరాదని సూచించారు. ముఖ్యంగా భక్తులకు తెలియజేయడమేమనగా కరోన థర్డ్ వే కొన్ని ప్రాంతాలలో వచ్చి నందున శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానము నందు కూడా రాత్రి పూట కర్ఫ్యూ అమల్లో ఉంటుంది అందరూ తెలుసుకోవాలని సూచించారు. దర్శన వేళలు ఉదయం 7;;; గంటల నుంచి రాత్రి 7.. గంటల వరకు స్వామివారి దర్శనం ఉంటుందని అనంతరం రాత్రివేళ దర్శనం నిలిపి వేయబడుతుందని భక్తాదులు కూడా ప్రతి ఒక్కరు రాత్రిపూట బస చేయడానికి వీలు లేదని స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు అందరూ ఈ సూచనలను సహకరిస్తారని తెలియజేశారు. తప్పకుండా ఈ సూచనలు పాటించండి వచ్చే సంవత్సరం శ్రావణమాసం ఇంకా ఘనంగా జరుపుకుందమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయం సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఆలయ అధికారులు పూజారులు తదితరులు పాల్గొన్నారు.

# సాగు చట్టాల రద్దుకై 9న దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయండి సీపీఐ

డోన్ ఆగస్టు 8, ( విభారె) రైతాంగ వ్యతిరేక నూతన సాగు చట్టాలు రద్దుకై తలపెట్టిన దేశవ్యాప్త ఆందోళనలో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం, ఏఐటీయూసీ, వ్యవసాయకార్మిక సంఘం, మహిళ సమాఖ్య, ఆధ్వర్యంలో స్థానిక నక్కి రామన్న భవన్ లో గోడ పత్రాలు విడుదల చేశారు. రైతు సంఘము అధ్యక్షుడు ఓబుళాపురం నారాయణ అధ్యక్షత సమావేశం జరిగింది. ఈసందర్భంగా సీపీఐ డోన్ నియోజకవర్గ కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, ఏ ఐ టి యూ సి జిల్లా అధ్యక్షులు పి.సుంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి. కె.రాధాకృష్ణ, లు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను తిలోదకాలిచ్చి సాగు చట్టాల పేరుతో వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి వ్యవసాయానికి రైతులకు దూరం చేయడమే కాకుండా కూలీలుగా మార్చే కుట్ర చేస్తున్నారన్నారు. సాగుకు ముందు వ్యాపారులతో ఒప్పందాలు, స్వేచ్ఛా వాణిజ్యం, నిత్యావసర వస్తువుల చట్టం సవరణ, రైతులకు ఆదాయం రెట్టింపు ఒక బూటకం అని అన్నారు. విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టి ఉచిత విద్యుత్తుకు ఎగనామం పెట్టాలనే ఆలోచన చేస్తున్నారని వారు ఆరోపించారు, ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడి భారం పెరిగిపోయి అతివృష్టి అనావృష్టి తో దెబ్బతిన్న పంటలకు పంటల బీమా ,పెట్టుబడి రాయితీ పరిహారం సకాలంలో చెల్లించ గా చేసిన అప్పులు తీర్చలేక అవమానభారంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాల్సిన ప్రభుత్వం కనీస మద్దతు ధరలు రద్దు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు, సంపద సృష్టి లో భాగస్వామ్యం అవుతున్న శ్రామిక వర్గ ప్రయోజనాలు తుంగలో తొక్కి, లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కటొక్కటిగా తెగనమ్మి అమ్ముకుని సొమ్ము చేసుకోవాలని చూస్తున్న పాలక ప్రభుత్వాలు ప్రయత్నాలను విఫలం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో పోరాడిన నాటి స్ఫూర్తిని రుచి చూపించాలన్నారు. దేశీయ ప్రయోజనాలను పణంగా పెడుతున్న పాలక ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ క్విట్ ఇండియా మూమెంట్ రోజు పురస్కరించుకొని " దేశాన్ని రక్షించండి- వ్యవసాయాన్ని కాపాడండి" అన్న నినాదాన్ని అందుకొని దేశవ్యాప్తంగా జరగనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఏ ఐ వై ఎఫ్ జిల్లా నాయకులు పులి శేఖర్, గౌండా బాషప పి రైతు సంఘం జిల్లా నాయకులు, చిన్న రంగన్న, సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, కార్యదర్శి, బి.నారాయణ, వరదరాజులు,ఏ ఐ టి యూ సి,కార్యదర్శి అబ్బాస్, మహిళ సమాఖ్య నాయకురాలు హసీనా, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన రాష్ట్ర చేనేత వికాస విభాగపు కార్యదర్శిగా రవిప్రకాష్

ఎమ్మిగనూరు ఆగస్టు 8, ( విభారె) పట్టణంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జనసేనపార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నియమించిన, రాష్ట్ర కమిటీలో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన కసా రవిప్రకాష్ ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు మహిళ సాధికారిక చైర్మన్ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జి రేఖగౌడ్ తెలిపారు, ఈ సంధర్బంగా రాష్ట్ర కార్యదర్శి రవిప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో నేతన్నలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ చేనేత కళాకారులకు అండగా ఉంటామని తెలిపారు, జనసేనపార్టీ క్రియాశీలక కార్యక్రమలలో కార్యకర్తగా బాధ్యతాయుతంగా పనిచేసిన తనను ఇంచార్జి రేఖగౌడ్ తనను గుర్తించి రాష్ట్ర చేనేత వికాస విభాగపు కమిటీలో కార్యదర్శి నియమించేలా కృషిచేశారని , అధినేత ఆశయాల సాధనకోసం సైనికుడిలా పనిచేస్తానని అన్నారు, చేనేతపురిగా పిలవబడే ఎమ్మిగనూరు చేనేత కార్మికుల సమస్యల సాధనకోసం నిరంతరం శ్రామికునిల పనిచేస్తానని తెలిపారు, భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన అతిపెద్ద ఉపాధి చేనేత ఈరంగానికి చెందిన చేనేత కార్మికులు కరోనా విపత్కర పరిస్థితుల్లో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని అన్నారు, చేనేత రంగాన్ని కాపాడుకోవాలంటే కళాకారులను ప్రోత్సాహించాలని కోరారు, జాతీయ చేనేత దినోత్సవం సంధర్బంగా చేనేత కళాకారులకు శుభాకాంక్షలు తెలిపారు,

# దేవాదాయ శాఖ అధికారులు సస్పెండ్

అమరావతి ఆగస్టు 8, ( విభారె) దేవాదాయశాఖ మాజీ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్పై సస్పెన్షన్ వేటు పడింది. రామచంద్రమోహన్ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింహాచలం దేవస్థానం ఈవోగా ఉన్నప్పుడు భూ మార్పిడి అక్రమాలకు పాల్పడ్డారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనపై వేటు వేశారు. ఇదే ఘటనలో సింహాచలం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుజాతను కూడా సస్పెండ్ చేశారు.

# కిడ్నాప్ కేసును ఛేదించిన అర్బన్ జిల్లా పోలీసులు

తిరుపతి ఆగస్టు 8, ( విభారె) కిడ్నాప్ కేసును అర్బన్ జిల్లా పోలీసులు ఛేదించారు. ఈనెల 2వతేదీన అలిపిరి బాలాజీ లింక్ బస్టాండ్ వద్ద నాలుగునెలల బాలుడు కిడ్నాపయ్యాడు. తల్లి గంగులమ్మ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన స్పెషల్ టీం దర్యాప్తు ప్రారంభించింది. పోలీసులు చివరకు మైసూరులో నిందితురాలు ఆషాను అదుపులోకి తీసుకున్నారు. అర్బన్ జిల్లా ఎస్పీ వెంకట అప్పల నాయుడు బాలుడిని క్షేమంగా తల్లికి అప్పగించారు. బిక్షాటన చేసేందుకే బాలుడిని ఆషా కిడ్నాప్ చేసిందని ఎస్పీ అన్నారు.

# 'టక్ జగదీష్' కు ఓటీటీ ఆఫర్ ఎంతంటే..?




నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కిన ఫ్యామిలీ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ "టక్ జగదీష్". శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి - హరీష్ పెద్ది నిర్మించారు. ఏప్రిల్ మూడో వారంలో విడుదల కావాల్సిన ఈ సినిమా కోవిడ్ సెకండ్ వేవ్ నేపథ్యంలో వాయిదా పడింది. అయితే ఇప్పుడు థియేటర్స్ తెరుచుకుంటున్నా ఈ సినిమా విడుదలపై క్లారిటీ రాలేదు. ఈ క్రమంలో నాని చిత్రాన్ని డైరెక్ట్ ఓటీటీలో రిలీజ్ చేస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగగా.. చిత్ర బృందం ఆ వార్తలను ఖండించింది. అయితే ఇప్పుడు ఫిలిం సర్కిల్స్ లో జరుగుతున్న చర్చల ప్రకారం 'టక్ జగదీష్' చిత్రాన్ని డిజిటల్ వేదికలోనే విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.'టక్ జగదీష్' చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నాని 'వి' సినిమాని ఓటీటీలో విడుదల చేయగా.. ఈసారి ఎలాగైనా థియేటర్లలోనే రిలీజ్ చేస్తారని భావించారు. అయితే ఇప్పుడు ఓటీటీ నుంచి భారీ ఆఫర్ రావడంతో థియేట్రికల్ స్కిప్ చేసి డిజిటల్ విడుదలకే మొగ్గు చూపారని టాక్ వినిపిస్తోంది. ప్రముఖ ఓటీటీ ఫ్లాట్ ఫార్మ్ అమెజాన్ ప్రైమ్ వీడియోతో ఈ చిత్రానికి సంబంధించిన ఓటీటీ డీల్ ఫైనల్ స్టేజిలో ఉ ఒదని అంటున్నారు. దీని కోసం ప్రైమ్ వారు 37 - 40 కోట్ల మధ్య చెల్లిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.ఇదే కనుక నిజమైతే 'టక్ జగదీష్' సినిమా డబ్బింగ్ రైట్స్ - ఆడియో - శాటిలైట్ హక్కులు అన్నీ కలుపుకుని దాదాపు 50 - 55 కోట్ల వరకు బిజినెస్ జరిగే అవకాశం ఉందని టాక్. కరోనా పరిస్థితుల్లో ఇది భారీ డీల్ అనే అనుకోవాలి. నాని సినిమా ఓటీటీ ఆఫర్ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆగాల్సిందే. కాగా 'టక్ జగదీష్' చిత్రంలో రీతూవర్మ - ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్ లుగా నటించారు. ఇందులో జగపతి బాబు - నాజర్ - డేనియల్ బాలాజీ - ప్రియదర్శి - తిరువీర్ - రోహిణి - ప్రవీణ్ ఇతర పాత్రలు పోషించారు. థమన్ సంగీతం సమకూర్చారు. ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ అందించగా.. ప్రవీణ్ పూడి ఎడిటింగ్ వర్క్ చేశారు. 'నిన్నుకోరి' తర్వాత నాని - శివ నిర్వాణ కాంబోలో తెరకెక్కుతున్న 'టక్ జగదీష్' సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.


# 'ఆర్ఆర్ఆర్' మరో ప్రమోషనల్ సాంగ్ వచ్చేది అప్పుడేనా?

టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఆర్ ఆర్ ఆర్ సినిమా షూటింగ్ ముగింపు దశకు వచ్చింది. ప్రస్తుతం ఉక్రెయిన్ లో చిత్రీకరణ జరుపుతున్నారు. అక్కడ రెండు పాటల చిత్రీకరణతో షూటింగ్ పూర్తి అవుతుంది. ఈ నెలలోనే ఇండియాకు తిరిగి రాబోతున్న చిత్ర యూనిట్ సభ్యులు సినిమా ప్రమోషన్ లో బిజీ అవ్వబోతున్నారు. అక్టోబర్ లో సినిమాను విడుదల చేయాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారు. సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ కార్యక్రమాన్ని మొదలు పెట్టబోతున్నారు. సినిమా విడుదలకు కనీసం నెల రోజుల నుండే పెద్ద ఎత్తున సోషల్ మీడియాతో పాటు అన్ని మీడియాల్లో కూడా సందడి చేసే విధంగా ప్రమోషన్ ను మొదలు పెట్టబోతున్నారు. సెప్టెంబర్ నెల మొత్తం ఆర్ ఆర్ ఆర్ టీమ్ చేయబోతున్న సందడితో మీడియా హడావుడి కనిపించబోతుంది. ఇటీవలే ఆర్ ఆర్ ఆర్ నుండి దోస్తీ సాంగ్ వచ్చిన విషయం తెల్సిందే. ఆ మ్యూజిక్ వీడియో ఇద్దరు హీరోలకు సంబంధించిన పాత్రలను పరిచయం చేయడంతో పాటు ఇద్దరి మధ్య స్నేహంను చూపించే విధంగా ఉంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన మరో ప్రమోషనల్ సాంగ్ కు తుది మెరుగులు దిద్దుతున్నారు. సెప్టెంబర్ లో సినిమా పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. కీరవాణి సంగీత సారథ్యంలో రూపొందిన ఆ పాటలో చిత్రంలో నటించిన నటీనటులు మరియు సాంకేతిక నిపుణులు కూడా కనిపించబోతున్నారట. మేకింగ్ వీడియో తరహాలో సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాల్లో షూట్ ను ఎలా చేశారనే విషయాన్ని రఫ్ గా చూపిస్తూ ఆ ప్రమోషనల్



సాంగ్ సాగుతుందట. మరోసారి ఆ పాటతో కీరవాణి అలరించడం ఖాయం అంటున్నారు. సినిమా స్థాయిని పెంచే విధంగా ఆ పాట ఉండేలా ఎడిటింగ్ చేయిస్తున్నారు. దోస్తీ సాంగ్ బాధ్యత పూర్తిగా రాజమౌళి తనయుడు కార్తికేయ చూసుకున్నాడు. రెండవ సాంగ్ బాధ్యతలు కూడా ఆయనకే రాజమౌళి అప్పగించారని తెలుస్తోంది. ఎన్టీఆర్ మరియు రామ్ చరణ్ ల అభిమానులతో పాటు ప్రతి ఒక్కరు కూడా ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# 'పుష్ప' స్టోరీ లైన్ ఇదేనట..!



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ - డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న బిగ్గెస్ట్ యాక్షన్ డ్రామా "పుష్ప". శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రెండు భాగాలుగా ఈ మూవీని విడుదల చేయబోతున్నారు. ఫస్ట్ పార్ట్ ని "పుష్ప: ది రైజ్" పేరుతో క్రిస్మస్ కానుకగా డిసెంబర్ లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ - టీజర్ ఈ సినిమాపై అంచనాలు పెంచేసాయి. ఇందులో పుష్పరాజ్ అనే ఊర మాస్ పాత్రలో బన్నీ కనిపించాడు. అదే సమయంలో ఈ సినిమా స్టోరీ లైన్ మీద అనేక ఊహాగానాలు వచ్చేలా చేసింది.'పుష్ప' చిత్రం ఒక రివేంజ్ డ్రామా అని ఇన్నాళ్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు లేటెస్టుగా ఈ సినిమా నేపథ్యంలో గురించి మరో రూమర్ చక్కర్లు కొడుతోంది. ఇందులో అల్లు అర్జున్ ఇల్లీగల్ ట్రాన్స్ పోర్ట్ బిజినెస్ చేస్తుంటాడని.. ఈ క్రమంలో స్మగ్లింగ్ చేస్తూ ఓ పెద్ద డాన్ లా ఎలా ఎదిగాడానేది ఫస్ట్ పార్ట్ లో చూపిస్తారని టాక్ నడుస్తోంది. అందుకే "పుష్ప: ది రైజ్" అనే టైటిల్ పెట్టారని అంటున్నారు. ఇక సెకండ్ పార్ట్ లో డాన్ అయిన తర్వాత పరిస్థితులను చూపించబోతున్నారట. ఇదే కనుక నిజమైతే 'పుష్ప' స్టోరీలో 'కేజీయఫ్' ఛాయలు కనిపించే అవకాశం ఉంది.ఇకపోతే 'పుష్ప 1' చిత్రంలో అల్లు అర్జున్ డీ గ్లామర్ లుక్ లో కనిపిస్తున్నాడు. 'తగ్గేదే లే' అంటూ రాయలసీమ ప్రాంతంలో చిత్తూరు యాసలో మాట్లాడుతున్నాడు. అంతేకాదు కొండ ప్రాంతాల్లో లారీ డ్రైవింగ్ నేర్చుకున్న బన్నీ.. రియల్ స్టంట్స్ చేస్తున్నాడు. ఇందులో కన్నడ బ్యూటీ రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తోంది. మలయాళ స్టార్ హీరో ఫహాద్ ఫాజిల్ విలన్ గా నటిస్తున్నారు. ప్రకాష్ రాజ్ - జగపతిబాబు - సునీల్ - అనసూయ భరద్వాజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.'పుష్ప' సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఇప్పటికే ఫస్ట్ పార్ట్ కు సంబంధించిన 90 శాతం షూటింగ్ పూర్తైందని తెలుస్తోంది. అలాగే 'పుష్ప 2' కోసం కూడా కొంత భాగం చిత్రీకరణ జరిపారు. మొదటి భాగాన్ని ఈ ఏడాది ఎండింగ్ లో రిలీజ్ ప్లాన్ చేస్తున్న మేకర్స్.. వచ్చే ఏడాది చివర్లో సెకండ్ పార్ట్ షూటింగ్ మొదలు కానున్నాయి. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు.

# చిన్నతనం నుంచే మేటి గోల్ఫర్.. అదితి అశోక్ యువతకు ఆదర్శం



హైదరాబాద్: అదితి అశోక్ ( ) ఇప్పుడో సెన్సేషన్. ఈ ఇండియన్ గోల్ఫర్ టోక్యో ఒలింపిక్స్‌లో అద్వితీయ ప్రదర్శన ఇచ్చింది. వ్యక్తిగత స్ట్రోక్ ప్లేలో ఓ మెరుపు మెరిసింది. టోక్యోలో మెడల్ మిస్సైనా.. ఇండియన్ గోల్ఫర్లు కూడా అంతర్జాతీయంగా రాణిస్తారన్న సంకేతాన్ని ఆమె ఇచ్చింది. ఆరేళ్ల వయసులోనే ఆమె గోల్ఫ్ ఆటకు ఆకర్షితురాలైంది. 2017లో ఆమె లేడీస్ ప్రొఫెషనల్ గోల్ఫ్ అసోసియేషన్ ప్లేయర్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ ఏడాది లూయిస్ సగ్స్ రూకీ ర్యాంకింగ్స్‌లో ఆమె 8వ స్థానంలో నిలిచింది. 2016లో రియోలో జరిగిన మహాక్రీడలకు ఎంపికైన యువ క్రీడాకారిణిగా కూడా రికార్డు సృష్టించింది. 18 ఏళ్ల, నాలుగు నెలల వయసులోనే ఆమె ఒలింపిక్స్‌కు ఎంట్రీ ఇచ్చింది. బెంగుళూరుకు చెందిన ఈ గోల్ఫర్.. రియోలో ఒంటరిగా మహిళల ఈవెంట్‌లో దేశం తరపున పోటీ చేసింది. ఈసారి టోక్యోలో మాత్రం అదితితో పాటు మరో గోల్ఫర్ దీక్షా సాగర్ కూడా రంగంలోకి దిగింది. 12 ఏళ్ల వయసులోనే గోల్ఫర్ అదితి.. ఆసియా పసిఫిక్ ఇన్విటేషనల్ టోర్నీలో పాల్గొన్నది. నిజానికి ఆ టోర్నీ ఆడేందుకు సగటును 18 నుంచి 22 ఏళ్ల వయసు ఉండాలి. ఇక 13 ఏళ్లకే భారత్‌లో జరిగిన తొలి ప్రొఫెషనల్ టూర్‌లో ఆమె విజయం సాధించింది. గోల్ఫ్‌లో సంచలనంగా మారిన అదితి.. వరుసగా మూడుసార్లు జాతీయ జూనియర్ చాంపియన్‌గా నిలిచింది. 2012 నుంచి 2014 వరకు ఆమె చాంపియన్‌గా ఆవిర్భవించింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**